ప్రజాశక్తి
మంగళవారం 10 జూన్ 2025 8 పేజీలు
ప్రకాశం బాపట్ల

నిరసన తెలుపుతున్న అఖిలపక్ష కార్మిక సంఘాల నేతలు

విశాఖ ఉక్కును

ప్రైవేటీకరించొద్దు..

- ప్రభుత్వం హామీ ఇచ్చేవరకు పోరాటం ఆగదు..
- అఖిలపక్ష కార్మిక సంఘాల నిరసన

ప్రజాశక్తి-ఒంగోలు సిటీ

విశాఖ ఉక్కును రాష్ట్ర ప్రభుత్వం ప్రైవేటీకరణ చేయబోమనే వరకు పోరాటం చేస్తామని అఖిలపక్ష కార్మిక సంఘాలు స్పష్టం చేశాయి. విశాఖ ఉక్కు పరిరక్షణ కోసం సోమవారం నాడు అఖిలపక్ష కార్మిక సంఘాలు ప్రకాశం భవన్ ఎదుట నిరసన చేపట్టాయి. సిఐటియు జిల్లా కార్యదర్శి గంటెనపల్లి శ్రీనివాసులు, ఏఐటియుసి జిల్లా ప్రధాన ▶ 2లో

హామీల అమలు సాధ్యమేనా.?

- ప్రతినెలా రూ.1500 కోసం మహిళల ఎదురుచూపులు
- తల్లికి వందనం..అన్నదాత సుఖీభవకూ ఇదే సమయం
- గ్యాస్, పెన్షన్ పెంపు ఈ రెండే ఇప్పటికీ ఆచరణలోకి..

ప్రజాశక్తి-ఒంగోలు బ్యూరో

రాష్ట్రం ఆర్థిక కష్టాల్లో ఉందని చెబుతూ సూపర్‌సిక్స్ పథకాలు అమలు చేయడానికి ఏడాది గడిపారు. ఎప్పుడెప్పుడా అని పేదలు ఎదురుచూస్తున్నారు. పాలకపక్ష నేతలు అవిగోఇవిగో ఇస్తామంటూ సభల్లో చెబుతూ వచ్చారు. చివరికి ఏడాది రావడంతో వాళ్లకే విసుగు పుడుతోంది. జనానికి ఏం చెప్పాలబ్బా అనే భావనలోకి వెళ్లిపోయారు. పాలనపైనా వీటి ప్రభావం పడుతోంది. ఇచ్చిన ఆరు హామీల్లో ఇప్పటికీ ఒక్కటే అమలులో పెట్టారు.

అదే ఏడాదికి మూడు గ్యాస్ సిలిండర్లు. లబ్ధిదారుల ఖాతాల్లో వెయ్యి రూపాయల్లోపే జమ అవుతున్నాయి. గతంలో అమ్మ ఒడి పథకం కింద రూ.15 వేలు ప్రకటించగా రూ.14 వేలు అకౌంట్లలో పడ్డాయి. ఇది లబ్ధిదారుడికి ఓ అవసరాన్ని తీర్చేలా ఉంది. ఇప్పుడూ ఈ పథకం ఉన్నా ఈ నెలలో ఎందరు విద్యార్థులుంటే అంతమందికి అకౌంట్లలో రూ.15 వేలు చొప్పున వేస్తామని ప్రభుత్వం చెబుతోంది. ఎంత మందికి ఈ లబ్ధి చేరుతుందో చూడాలి. ఏడాదిలో గ్యాస్ సిలిండర్లతో పాటు అధికారంలోకి రాగానే పెన్షన్ పెంచారు. దీన్ని నెల నెలా నేరుగా మంత్రులు, ఎమ్మెల్యేలే పేదల ఇళ్లకు వెళ్లి ఇస్తున్నారు. పెన్షన్ పథకం ఆచరణలో నూటికి నూరుశాతం అమలులో పెట్టారు. ఇక భర్తలు చనిపోయిన వారికి గానీ, ఈ ఏడాదిలో పెన్షన్ ▶ 2లో

స్వల్ప భూప్రకంపనలు

- ముండ్లమూరులో ఏడోసారి..
- అద్దంకిలో రెండోసారి..
- భయాందోళనలో ప్రజలు

ప్రజాశక్తి-అద్దంకి, ముండ్లమూరు

అద్దంకి పరిసర ప్రాంతాల్లో, ముండ్లమూరు మండలంలో పలుచోట్ల ఆదివారం అర్ధరాత్రి స్వల్ప భూప్రకంపనలు సంభవించాయి. ముండ్లమూరు మండలంలోని వేముల, కెల్లంపల్లి, ఉలగల్లు, పసుపుగల్లు, ముండ్లమూరు, వేంపాడు, పోలవరం, శంకరాపురం, సింగనపాలెం గ్రామాల్లో ఆదివారం రాత్రి 12 గంటలకు స్వల్పంగా భూమి కంపించింది. గత ఐదు, ఆరు సంవత్సరాల కాలంలో ఏడు సార్లు భూకంపం రావడంతో మండల ప్రజలు భయాందోళనలకు గురవుతున్నారు. అదేవిధంగా అద్దంకి పరిసర ప్రాంతంలో ఆదివారం అర్ధరాత్రి స్వల్ప భూకంపం సంభవించింది. 12 గంటలా 47 నిమిషాల సమయంలో దాదాపు నాలుగు సెకండ్ల పాటు భూమి కంపించడంతో బహుళ అంతస్తులలో వంట పాత్రలు కిందపడిపోయాయి. దీంతో ప్రజలు ఒక్కసారిగా భయాందోళనకు గురయ్యారు. గత ఏడాది కాలంలో రెండు సార్లు భూకంపాలు సంభవించాయి. ఈ భూకంపాలు ఎందుకు సంభవిస్తున్నాయో అర్థంకాని పరిస్థితి నెలకొంది. చీమకుర్తి క్వారీల సమీపం నుండి ఈ స్వల్ప భూకంపం వచ్చిందని స్థానికులు చర్చించుకుంటున్నారు.

జెండా ఊపి.. ర్యాలీని ప్రారంభిస్తున్న కలెక్టర్, ఎమ్మెల్యేలు

యోగాసనాలతో నూతనోత్తేజం

- కలెక్టర్ తమీమ్‌అన్సారియా
- యోగా ర్యాలీ ప్రారంభం

▲ 2లో

జగన్ పర్యటన ఏర్పాట్లను పరిశీలిస్తున్న అన్నా, బూచేపల్లి

జగనన్న పోరుబాటను

జయప్రదం చేయండి

ఏర్పాట్లు పరిశీలించిన బూచేపల్లి

▲ 3లో

షైనింగ్ స్టార్ 2025 అవార్డులు అందజేస్తున్న కలెక్టర్, ఎమ్మెల్యేలు

ప్రతి విద్యార్థీ

ఉన్నతంగా ఎదగాలి

కలెక్టర్ వెంకట మురళి

ప్రజాశక్తి-బాపట్ల జిల్లా

ప్రతి విద్యార్థీ ఉన్నతంగా ఐఎఎస్, ఐపీఎస్, శాస్త్రవేత్తలు, వైద్యులు వంటి ఉన్నతమైన ఉద్యోగాలను సాధించే దిశగా కృషి చేసి.. భావిభారత పౌరులుగా ఎదగాలని కలెక్టర్ జె.వెంకట మురళి కోరారు. షైనింగ్ స్టార్-2025 అవార్డుల ప్రదానోత్సవం సోమవారం స్థానిక సాయిరాం గ్రాండ్ కన్వెన్షన్ హాల్‌లో జరిగింది. ఇంటర్మీడియట్, పదో తరగతి విద్యలో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులకు ప్రతిభ పురస్కారాలను అందించారు. ప్రతిభావంతులైన ▶ 2లో

పాదర్తిలో కేంద్ర బృందం పర్యటన

ప్రజాశక్తి- కొత్తపట్నం

మండల పరిధిలోని పాదర్తి గ్రామపంచాయతీలో కేంద్ర బందం సోమవారం పర్యటించింది. ఈ సందర్భంగా ఉపాధి హామీ చట్టం ద్వారా సాగు చేసిన ఉద్యానవన మొక్కలకు పెంపకాన్ని పరిశీలించారు. అనంతరం గృహ నిర్మాణాలను పరిశీలించారు. వృద్ధాప్య, వికలాంగ మరియు వితంతు పింఛను దారులతో నేరుగా మాట్లాడారు. పెన్షను సక్రమంగా అందుతుందా లేదా అని తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో దిశ జాయింట్ డైరెక్టర్ ఉమేష్ కుమార్ రామ్, ఎకౌంట్స్ అధికారి జివిఎస్.రావత్, డిఆర్‌డిఎ ప్రాజెక్టు డైరెక్టర్, డ్వామా పీడీ, హౌసింగ్ పీడీ, డిప్యూటీ ఎంపీడీవో వేణు, పాదర్తి పంచాయతీ కార్యదర్శి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

మాట్లాడుతున్న కేంద్ర బృందం సభ్యులు

ప్రకృతి వ్యవసాయ పంటలతో ఆరోగ్యానికి మేలు

ప్రజాశక్తి-కొత్తపట్నం: ప్రకృతి వ్యవసాయ పంటలతో ఆరోగ్యానికి ఎంతో మేలని మాస్టర్ ట్రైనర్ నరసింహులు తెలిపారు. ప్రకతి వ్యవసాయంతో పండించిన ఆకుకూరలు, కూరగాయలు, ఇతర పంటను సోమవారం విక్రయించారు. ఐసిఆర్‌పిలు సురేష్, ప్రవీణ్ పాల్గొన్నారు.

హామీల అమలు సాధ్యమేనా.?

(మొదటిపేజీ తరువాయి)

పొందేందుకు అర్హత ఉన్నవారికి గానీ కనీసం దరఖాస్తు కూడా స్వీకరించడం లేదు. ఎందుకంటే కొత్తగా పెన్షన్లు ఇస్తే ఆర్థిక భారం పడుతుందనే భయం వెంటాడుతోంది. ఈ పాటికే పెన్షన్ పొందే వారిలో ఒకరు చనిపోతే బతికి ఉన్న వారికి పింఛన్ వచ్చేలా మార్పు చేశారు. ఇదొక్కటే సవరణ చేశారు. దీంతో పాటు గత ప్రభుత్వం రద్దు చేసిన అన్నా క్యాంటీన్‌లు తెరిచారు. ఇవి కూడా అన్ని నియోజక వర్గాల్లో పెట్టలేదు. దశలవారీగా చేపట్టారు. ఇవిపోగా మిగతా వాటి సంగతేంటనే చర్చ సాగుతోంది. మహిళలు నెలనెలా రూ.1500 ఇస్తామని చెప్పిన హామీ రోజూ గుర్తు చేసుకుంటున్నారు. 18 ఏళ్లు నిండినవారంతా వీటికోసం ఆశగా ఎదురుచూస్తూనే ఉన్నారు. ఇంకెంతకాలం అంటున్నారు. తల్లికి వందనం గత జూన్‌లో అధికారంలోకి వచ్చిన ఆరంభం కాబట్టి వదిలేశారు. ఇప్పుడు విద్యాసంవత్సరం ఆరంభమైంది. ఇప్పుడైనా ఇస్తారా? లేదా? అనే చర్చ సాగుతోంది. బడులు తెరిచే నాటికి ఇస్తే పుస్తకాలు, బ్యాగులకు ఉపయోగపడతాయి. ఫీజులకూ ఎంతోకొంత చేదోడువాదోడుగా ఉంటాయి. వ్యవసాయదారులకూ జూన్‌లో ఖరీఫ్ మొదలు కానుంది. పెట్టుబడుల కోసం ప్రతి రైతూ అప్పులు చేయడం ఆనవాయితీ. అన్నదాత సుఖీభవ పథకం కోసం ఎదురుచూస్తున్నారు. ఇంకా ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం కోసం మహిళలు ఎదురుచూస్తున్నారు. నిరుద్యోగులకు ఉద్యోగం వచ్చే వరకూ భృతి ప్రకటించారు. ఇది ఎవరికీ రావడం లేదు. ఇంజనీరింగ్ పూర్తయి ఉద్యోగాలు వేలాది మందికి రావడం లేదు. సాఫ్ట్‌వేర్ తిరోగమనం వైపు వెళుతోంది. ఏదైనా శిక్షణ కోసం యువత ఎదురుచూస్తోంది. ఇంజినీరింగ్ కాలేజీల్లో చదువులు పూర్తయిన యువత అందరూ ఇప్పుడు ఆందోళనగా ఉన్నారు. 90 శాతం మందికి జాబ్‌లు రాలేదు. పెద్దపెద్ద పట్టణాల్లో చదివిన వారి పరిస్థితీ ఇదే. బాబు వస్తే జాబ్ వస్తుందనే ప్రచారం వీరిని ఆకట్టుకుంది. ఆచరణలో వీరికి ఆదరణ కనిపించడం లేదు. ఏడాదిగా ఇలా అందరూ ఏదో ఆశగానే ఎదురుచూస్తున్నారు. ప్రభుత్వం ఇప్పటికైనా ఇచ్చిన హామీలు అమలు చేస్తుందా? లేదా? అనే స్పష్టత కూడా కనిపించడం లేదు. ఇప్పటికే కొన్ని పథకాలకు గడువు పెట్టారు. ఆ సమయానికైనా ఆచరణలోకి తెస్తారా? లేదా? అనేదీ చూడాలి.

యోగాసనాలతో నూతనోత్తేజం..

కలెక్టర్ తమీమ్‌అన్సారియా యోగా ర్యాలీ ప్రారంభం

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

యోగాసనాల ద్వారా ప్రతి నిత్యం ఆరోగ్యంగా కొత్త ఉత్తేజంతో ఆరోగ్యకరమైన జీవనం సాగించవచ్చని కలెక్టర్ తమీమ్ అన్సారియా పేర్కొన్నారు. జిల్లాలోని అన్ని వర్గాల ప్రజలనూ యోగాంధ్ర క్యాంపెయిన్‌లో భాగం చేసే లక్ష్యంతో జిల్లావ్యాప్తంగా యోగా ర్యాలీ కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. యోగాంధ్ర క్యాంపెయిన్‌లో భాగంగా సోమవారం ఒంగోలు కలెక్టరేట్ వద్ద ఏర్పాటు చేసిన యోగ ర్యాలీని కలెక్టర్ ఏ.తమీమ్‌అన్సారియా, ఒంగోలు, సంతనూతలపాడు శాసనసభ్యులు దామచర్ల జనార్ధన్‌రావు, బిఎన్.విజయకుమార్, ఎపి పర్యాటక అభివద్ధి సంస్థ చైర్మన్ డాక్టర్ నూకసాని బాలాజీ, జాయింట్ కలెక్టర్ ఆర్.గోపాలక్రిష్ణలతో కలిసి జెండా ఊపి ప్రారంభించారు. ఈ యోగా ర్యాలీ ఒంగోలు కలెక్టరేట్ వద్ద నుండి మినీ స్టేడియం వరకు నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ ఈ నెల 20న సుమారు 10 వేల మంది స్వయం సహాయక సంఘాల సభ్యులతో యోగా కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు అందరూ కషి చేయాలన్నారు. ఒంగోలు శాసన సభ్యులు దామచర్ల జనార్ధన్‌రావు మాట్లాడుతూ ఈ నెల 21న జరగనున్న అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని విజయ వంతం చేయాలన్నారు. సంతనూతలపాడు శాసనసభ్యులు బిఎన్.విజయకుమార్ మాట్లాడుతూ యోగాసనాలతో ఒక్క శారీరక ఆరోగ్యమే కాకుండా మానసిక ఆరోగ్యమూ సొంతమవుతుందని పేర్కొన్నారు. ఎపి పర్యటకాభివద్ధి సంస్థ చైర్మన్ నూకసాని బాలాజీ, జాయింట్ కలెక్టర్ ఆర్.గోపాలక్రిష్ణ మాట్లాడారు. యోగా ర్యాలీలో జిల్లా రెవెన్యూ అధికారి శ్రీ చినఓబులేసు, ఒంగోలు ఆర్డీవో లక్ష్మీప్రసన్న, జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారి వెంకటేశ్వరరావు, డిపిఓ వెంకట నాయుడు, మెప్మా పీడీ శ్రీహరి, బిసి కార్పొరేషన్ ఈడి వెంకటేశ్వరరావు, మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వరరావు, జిల్లా వ్యవసాయ శాఖాధికారి శ్రీనివాసరావు, ఆయుష్ శాఖ ఆర్డీడీ పద్మజాతి, స్టెప్ సీఈఓ పి.శ్రీమన్నారాయణ పాల్గొన్నారు.

BEFORE THE DISTRICT CONSUMER DISPUTES REDRESSAL COMMISSION, ONGOLE:: (PRAKASAM DISTRICT)

C.C.No. 10 /2025

Between
Yadavalli Ramakrishna, ...Complainant
And
1.Sahara Credit Co-Operative Society Ltd., ongole rep.by its Branch Manager, Ongole. & Other's ...Opposite Parties

To

1) Sahara Credit Co-Operative Society Ltd, Rep.by its Branch Manager
D.No 37-1-160 (9) (Above) Satya cable Office, behind Bapuji complex,
Srinivasa Theatre road,islampet Ongole

పై నెంబర్ కేసులో మీకు ఎన్నిసార్లు నోటీసులు పంపినను తీసుకొనక ఉద్దేశపూర్వకంగా త్రిప్పి పంపినందున శ్రీ కోర్టు వారు మీకు ఈ పేపర్ ప్రకటన ద్వారా నోటీసు పంపమని ఆర్డర్ వేసి యున్నారు. వాయిదా తేది:23-06-2025 కావున ఆ రోజు ఉదయం 10:30 కి మీరు స్వయంగా గాని ప్లీడరు ద్వారా గాని పైకోర్టునకు హాజరై మీకు గల ఆక్షేపణలు తెలుపగలరు లేనియెడల మీ పరోక్షమున కేసును తీర్మానించబడునని తెలియజేయడమైనది.

// కోర్టు వారి ఉత్తర్వుల మేరకు //

ఇట్లు
C.సుబ్బారావు
అడ్వకేట్, ఒంగోలు.

వేలం ప్రకటన

మహారాజశ్రీ పర్చూరు సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో

EP 1/2019 in OS 51/2012

(S.C.j. Court. Addanki)

Between :-
చిన్ని శ్రీహరి .....DHR
V/s
కుంచనపల్లి శ్రీనివాసరావు వగైరాలు ...JDR's

పై నెంబరు EPలోని JDRs వద్ద నుండి రావలసిన decree బాకీని రాబట్టుకొను నిమిత్తం EP షెడ్యూలు దాఖలా స్థిరాస్తిని మహారాజశ్రీ పర్చూరు సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో ది: 16-06-2025 వతేదీన ఉదయం గం.10:30 ని.ల నుండి సాయంత్రం 5గంటలలోగా బహిరంగ వేలము వేయుదురు. వేలం నందు పాల్గొన దలచిన వారు పై తెల్పిన తేదీన పైకోర్టు నందు హాజరు అయి షరతులకు లోబడి వేలంలో పాల్గొనవచ్చును అని ఇందుమూలంగా తెలియజేయడమైనది.

షెడ్యూలు

Old Prakasam District, Bapatla District - pachur SRO-Yaddanapudi (Mandal)- poluru village - poluru Grama panchayat. area-Ward No-1-An extant of Ac 0:05 Cants of site - A Tiled House Bearing Door no: 1-130-B-Assesment No: 65-belonged to Deceased 1st jDR name by kunchnapalli Srinivasa Rao under positioning of JDRS 2 to 7 Situated with the following boundaries .

East :- property of Dandi anjaneyulu
South :- property of Natani papa Rao
West:- proparty of karu Manchi IndiraDevi
North :- & property of Kunchanapalli Subba Rao
DHR Value Rs.1,00,000/-
Amin Value Rs.5,00,000/-
SRO Value Rs. 212960/-
వేలం తేది : **16-06-9025**
ఫర్‌దర్ హియరింగ్ : **23-06-2025**

ఇట్లు
కొల్లా నరేంద్ర కుమార్
DHR తరుపు న్యాయవాది ,పర్చూరు
Cell : 9440638201.

విశాఖ ఉక్కును ప్రైవేటీకరించొద్దు..

(మొదటిపేజీ తరువాయి)

కార్యదర్శి కొత్తకోట వెంకటేశ్వర్లు, ఐఎఫ్టియు రాష్ట్ర కార్యదర్శి ఆర్.మోహన్ అధ్యక్షతన ఈ కార్యక్రమం నిర్వహించారు. సంయుక్త కిసాన్ మోర్చా జిల్లా కన్వీనర్ చుండూరు రంగారావు మాట్లాడుతూ విశాఖ ఉక్కు కోసం అవసరమైతే మరోసారి ప్రాణత్యాగాలకు సిద్ధంగా ఉండాలని ఆయన ప్రకటించారు. రాష్ట్ర ప్రభుత్వం విశాఖ ఉక్కుని రక్షిస్తాం, ప్రైవేటీకరణ కానివ్వబోమని హామీ ఇచ్చేంతవరకు పోరాటం కొనసాగుతోందని స్పష్టం చేశారు. సిఐటియు జిల్లా అధ్యక్షులు కాలం సుబ్బారావు మాట్లాడుతూ ఉద్యోగులు, కార్మికులు, ప్రజలందరూ ఐక్యంగా విశాఖ ఉక్కుని రక్షించుకోవడానికి ఉద్యమించాలన్నారు. ఏఐయఫ్‌టియు న్యూ జిల్లా కార్యదర్శి యం.యస్.సాయి మాట్లాడుతూ మిట్టల్ కంపెనీకి సౌకర్యాలు, రాయితీలు కల్పిస్తూ విశాఖ ఉక్కుని రక్షించడంలో కేంద్ర ప్రభుత్వం వివక్షత చూపుతోందని విమర్శించారు. కార్యక్రమంలో రైతుసంఘం జిల్లా నాయకులు పెంట్యాల హనుమంతరావు, సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు జివి కొండారెడ్డి, శ్రామిక మహిళా జిల్లా కన్వీనర్ పి.కల్పన, పిడిఎస్‌యు రాష్ట్ర అధ్యక్షులు రాజశేఖర్, ఎస్ఎఫ్ఐ రాష్ట్ర నాయకులు సిహెచ్.వినోద్, సిఐటియు నగర నాయకులు తంబి శ్రీనివాసులు, బివి.రావు, సిహెచ్.రాంబాబు, జి.రమేష్, సయ్యద్ సలార్, సయ్యద్ మున్నాబాషా పాల్గొన్నారు.

ప్రతి విద్యార్థీ ఉన్నతంగా ఎదగాలి..

(మొదటిపేజీ తరువాయి)

పదో తరగతిలో 164 మంది విద్యార్థులు, ఇంటర్మీడియట్‌లో 36 మంది విద్యార్థులను అధికారులు ఘనంగా సత్కరించారు. కలెక్టర్ తమీమ్‌అన్సారియా మాట్లాడుతూ తాను ఎనిమిదో తరగతిలో అత్యంత ప్రతిభ కనబరచడంతో ప్రభుత్వం నుంచి ఉపకార వేతనాన్ని పొందానని, ఇలాంటి గుర్తింపు అప్పట్లో రాలేదన్నారు. అయినప్పటికీ ఉపకారం వేతనం పొందిన స్ఫూర్తితోనే అంచెలంచెలుగా ఎదిగి, పబ్లిక్ సర్వీస్ కమిషన్ పరీక్షల్లోనూ అప్పటి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ఆంధ్రప్రదేశ్ టాపర్‌గా నిలిచానని తన అనుభవాలను విద్యార్థులతో కలెక్టర్ పంచుకున్నారు.

బాపట్ల శాసనసభ్యులు వేగేశన నరేంద్రవర్మ మాట్లాడుతూ విద్యార్థుల భవిష్యత్తు కోసం రాష్ట్ర విద్యాశాఖ విశేషంగా కషి చేస్తోందన్నారు. చీరాల శాసనసభ్యులు ఎం మాలకొండయ్య మాట్లాడుతూ ప్రతిభావంతులను వెలికితీసి, సమాజం కోసం ప్రయోజకులను చేయడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. కార్యక్రమంలో ఆర్డీవో పి గ్లోరియా, డీఈవో పురుషోత్తం, ఆర్ఐఓ ఆంజనేయులు, సమగ్ర శిక్ష అభియాన్ ఏపీసి నాగిరెడ్డి, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, అధికారులు పాల్గొన్నారు.

పోరుబాట పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి -శింగరాయకొండ

ఈనెల 11న పొదిలిలో మాజీ ముఖ్యమంత్రి జగన్‌మోహన్ ఆధ్వరయంలో నిర్వహిస్తున్న రైతు పోరుబాటను విజయవంతం చేయాలని వైసిపి మండల అధ్యక్షుడు మసనం వెంకట్రావు కోరారు. స్థానిక పార్టీ కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. జగన్మోహన్ రెడ్డి రైతుల కోసం చేస్తున్న పోరబాట కార్యక్రమానికి శింగరాయకొండ మండలం నుంచి వైసిపి నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో తరలి రావాలన్నారు. అనంతరం రైతు పోరుబాటకు సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో చుక్కా కిరణ్ కుమార్, యనమల మాధవి , గొల్ల పోతు గోవర్ధన్, షేక్ అబ్దుల్లా, షేక్ కరీం , షేక్ నౌషాద్ పాల్గొన్నారు.

వైసీపీ గ్రామ కమిటీ ఎన్నిక

ప్రజాశక్తి-నాగులుప్పలపాడు

వైసీపీని క్షేత్రస్థాయిలో బలోపేతం చేసుకోవాల్సిన అవసరం ప్రతి ఒక్కరిపై ఉందని మాజీమంత్రి మేరుగు నాగార్జున అన్నారు. నాగులుప్పలపాడు మండలం మద్దిరాల ముప్పాళ్లలో సోమవారం గ్రామ కమిటీ ఎన్నిక కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా నాగార్జున మాట్లాడుతూ గ్రామకమిటీల ద్వారా కూటమి ప్రభత్వంపై పోరాడాలన్నారు. ఈ కార్యక్రమంలో నలమలపు కృష్ణారెడ్డి, మండల కన్వీనర్ పోలవరపు శ్రీమన్నారాయణ, కోటిరెడ్డి, పొలినేని కోటేశ్వరరావు, పాలడుగు రాజీవ్, మండల ఉపాధ్యక్షుడు కాటూరి ఆదియ్య, బీసీ సెల్ మండల అధ్యక్షుడు పాదర్తి శివ , కందుల దానియేలు, ఘట్టమనేని అశోక్, గ్రామ నాయకులు జెట్టి శ్రీనివాసరావు, తగిరిస సుబ్బారావు పాల్గొన్నారు.

గ్రామ పంచాయితీ కార్యాలయం, యనమదల గ్రామము, యద్దనపూడి (మం), బాపట్ల (జిల్లా)

ఆర్.ఓ.సి.నెం:8/2025 **టెండరు ప్రకటన.** **తేదీ:10-08-2025**

బాపట్ల జిల్లా యద్దనపూడి మండలం యనమదల గ్రామ పంచాయితీలో తేది 01-07-2025వ సంవత్సరం నుండి 30-06-2006 సంవత్సరం వరకు ఒక్క సంవత్సర కాలానికి పని చేయుటకు గాను ఈ దిగువ తెలిపిన సిబ్బంది పని చేయుటకు సీల్డు వేసిన టెండర్లను తేది :16-06-2025 ఉదయం 11:00 గంటల వరకు ఈ దిగువ సంతకం దారు వద్ద గాని లేక అనుమతి పొందిన వారిచే గాని యనమదల గాను పంచాయితీకార్యాలయం వద్ద స్వీకరించబడును. సదరు సీలు వేసిన టెండర్లను అదే రోజు అదే ప్రదేశంల ఉదయం 11.30 గంటలకు హాజరైన టెండరు దారుల సమక్షంలో తెరువబడును. ఆసక్తి గల వారు ఆయా అయిటంకు ఎదురుగా చూపబడిన ధరావచ్చు చెల్లించి టెండరులు పాల్గోనవచ్చును. ధరావత్తు చెల్లిందని మరియు సకాలంలో రానీ టెండర్లు స్వకరించబడవు. ఏ కారణం చూపకుండానే టెండర్లు వాయదా వేయుటకు లేదా రద్దు పరుచుటకు పంచాయితీ కార్యదర్శికి అధికారం కలదు. మిగిలిన విషయాలు ఆఫీసు పని వేళలలో అడిగి తెలుసుకొనవచ్చును.

వ.నెం	సరఫరా వివరములు	చెల్లించవలసిన ధరావతు మొత్తం రూ/-
1)	01-07-2025 సం.నుండి 30-06-2026 సం.వరకు బిల్ కలెక్టర్ గాప పనిచేయుటకు	రూ.100/-
2)	01-07-2025 సం.నుండి 30-06-2026 సం.వరకు ఎలక్ట్రిషియన్ రోజు వారి కూలిపై పని చేయుటకు	రూ.100/-
3)	01-07-2025 సం.నుండి 30-06-2026సం.వరకు స్వీపర్ రోజు వారి కూలిపై పని చేయుటకు	రూ.100/-
4)	01-07-2025 సం.నుండి 30-06-2026 సం.వరకు సైడ్ డ్రైన్ క్లీనర్ రోజు వారి కూలిపై పని చేయుటకు	రూ.100/-
5)	01-07-2025 సం.నుండి 30-06-2026 సం.వరకు RO (ఆర్వో) ప్లాంట్ మెయింటినర్ రోజువారి కూలి పై పనిచేయుటకు చింతపల్లిపాడు, యనమదల(2) లో	రూ.200/-

గమనిక:- 1) పంచాయితీ నిధులు సమృద్ధిగా ఉన్నప్పుడు మాత్రమే చెల్లింపులు చేయబడును.
2) టెండర్లకు సంబంధించిన ఏ విషయం లో నైనా ఏ న్యాయస్థానంలో ఫిర్యాదు చేయరాదు.
3) పంచాయితీ కార్యదర్శి గారిచే ఎప్పటికప్పుడు జారీచేయబడు ఆదేశాలను టెండరుదారు తప్పక పాటించవలెను.

సం/- అత్తంటి రాణి
యనమదల గ్రామం
పంచాయితీ కార్యదర్శి యద్దనపూడి మండలం, బాపట్ల జిల్లా,

శింగరాయకొండ పోలీస్ స్టేషన్ వద్ద ఉద్రిక్తత

నిందితుడి అరెస్టులో జాప్యంపై ఆగ్రహం

స్టేషన్‌లోకి దూసుకొచ్చిన 200 మంది

పోలీసులు, గ్రామస్థుల మధ్య తోపులాట

ప్రజాశక్తి-శింగరాయకొండ

శింగరాయకొండ పోలీస్ స్టేషన్ వద్ద సోమవారం ఉద్రిక్త వాతావరణం చోటుచేసుకుంది. మండలంలోని సోమరాజు పల్లి గ్రామానికి చెందిన పొట్టేళ్ల జగదీశ్ అనే ఆటో డ్రైవర్ ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన సంఘటన తెలిసిందే. ఈ ఘటనలో ప్రమాదానికి కారణమైన

పోలీసులతో వాగ్వాదం చేస్తున్న మృతుడి బంధువులు

స్టేషన్‌లకి దూసుకెళ్తున్న గ్రామస్థులు

ట్రాక్టర్ డ్రైవర్‌ను అరెస్టు చేయడంలో పోలీసులు నిర్లక్ష్యం వహిస్తున్నారంటూ మృతుడు జగదీశ్ కుటుంబ సభ్యులు, బంధువులు, సోమరాజుపల్లి గ్రామస్థులు అంత్యక్రియలు నిర్వహించకుండానే స్టేషన్‌కు చేరుకున్నారు. ట్రాక్టర్ డ్రైవర్‌ను అరెస్టు చేయకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. సుమారుగా 200 మంది గ్రామస్థులు ఒక్కసారిగా ఆగ్రహంతో పోలీస్ స్టేషన్‌లోకి దూసుకురావడంతో స్టేషన్ వద్ద ఉద్రిక్త వాతావరణ నెలకొంది. ట్రాక్టర్ డ్రైవర్‌ని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అయితే ఈ క్రమంలో పోలీసులు దురుసుగా ప్రవర్తించారంటూ సోమరాజుపల్లి, ఉలవపాడు మండలంలోని కొల్లూరుపాడుకు చెందిన జనం పోలీసులపై వాదనకు దిగారు. ఒకరినొకరు అరుచుకుంటూ తోచుకునే వరకు వచ్చింది. ఆ తర్వాత కొంత మంది యువకులు పోలీసులపై దురుసుగా ప్రవర్తించడంతో పోలీసులు అరుస్తూ ఆందోళనకారులను తరిమారు. ఒక యువకుడు రైల్వే రోడ్డు వరకు వెళ్లి అక్కడ పోలీసులపై దాడికి దిగాడు. పోలీసుల మీద దాడి చేయడంతో ఆ యువకుడిని పట్టుకొని స్టేషన్‌కు తీసుకువచ్చే సమయంలో ఒక్కసారిగా జనం మొత్తం పోలీస్ స్టేషన్ ముందు పోలీసులను చుట్టుముట్టారు. ఆటోని సైతం ముందుకు పోనివ్వకుండా అడ్డుకున్నారు. ఈ ఘటనలో ఎస్ఐ బి.మహేంద్రని సైతం అక్కడ ఉన్న జనం తోసి వేసే పరిస్థితి చోటుచేసుకుంది. అదుపులోకి తీసుకున్న యువకుడ్ని వదిలివేస్తేనే తప్ప బయటకు వచ్చే సమస్య లేదని పోలీస్ స్టేషన్ ముందు ఆందోళనకు దిగారు. దీంతో అక్కడికి చేరుకున్న తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు వేల్పుల సింగయ్య పోలీసులకు, మృతుడి తరపున బంధువులకు నచ్చజెప్పి అంత్యక్రియలు చేసుకోవాలని సూచించారు. పోలీసులు అదుపులోకి తీసుకున్న యువకుడి గురించి తర్వాత ఆలోచిద్దామని ముందు అంత్యక్రియలు చేసుకోవాలని చెప్పడంతో అక్కడి నుంచి జనం వెళ్లి మృతి చెందిన పొట్టేల జగదీష్ అంత్యక్రియలు నిర్వహించారు. పోలీసులపై దాడి చేయడం పోలీస్ స్టేషన్ ముందు ఆందోళన చేయటంతో జరుగుమల్లి, ఒంగోలు, టంగుటూరు పోలీసులు రంగంలోకి దిగి అక్కడ జరిగిన విషయాన్ని తెలుసుకొని జనాన్ని పంపించేశారు.

12న 'బ్రిలియంట్' ఆధ్వర్యంలో మాక్ వెబ్ కౌన్సెలింగ్

ప్రజాశక్తి-ఒంగోలు

మాట్లాడుతున్న బ్రిలియంట్ సంస్థ అధినేత న్యామతుల్లా

వెబ్ కౌన్సెలింగ్‌కి హాజరు కానున్న ఇంజినీరింగ్, మెడికల్ స్టూడెంట్స్ కోసం ఒంగోలు బ్రిలియంట్ కంప్యూటర్ సంస్థ ఆధ్వర్యంలో జూన్ 12న ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు ఒంగోలు పట్టణంలోని గుంటూరు రోడ్డులో గల ఎ1 ఫంక్షన్ హాల్లో ప్రత్యేక మాక్ వెబ్ కౌన్సెలింగ్ ప్రోగ్రామ్ నిర్వహిస్తున్నట్లు ఆ సంస్థల అధినేత డాక్టర్ న్యామతుల్లా భాష తెలిపారు. అదివారం బ్రిలియంట్ సంస్థ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమంలో మంత్రి డోలా శ్రీ బాల వీరాంజనేయ స్వామి, ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ రావు, ఎంపీ మాగుంట శ్రీనివాసులురెడ్డి, కలెక్టర్ ఎ.తమీమ్ అన్సారియా, మేయర్ శ్రీమతి గంగాడ సుజాత, దామచర్ల సత్య, రిటైర్డ్ డీజీపీ కె.ఆర్.ఎం. కిషోర్ కుమార్, ప్రముఖ యూనివర్సిటీలు, ఇంజనీరింగ్ కాలేజ్‌లు, డిగ్రీ కాలేజ్‌లు హెూటల్ మేనేజ్మెంట్ కాలేజీల వైస్ ఛాన్సులర్స్, ప్రొఫెసర్లు, ప్రిన్సిపాల్స్, ఛైర్మన్‌లు పాల్గొని స్టూడెంట్స్ కెరీర్ గైడెన్స్‌కి అవసరమైన అమూల్యమైన విషయాలపై అవగాహన కల్పిస్తారన్నారు. సదస్సుకు హాజరయ్యే వారికి ఉచిత భోజనంతో పాటు అన్ని ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. గత 21 సంవత్సరాలుగా ఈ ఎడ్యుకేషన్ ఫెయిర్ నిర్వహిస్తున్నామని ఈ సదవకాశం వినియోగించుకవాలని కోరారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులకు లక్కీ డ్రా ద్వారా ఇద్దరికి ల్యాప్ ట్యాప్ ఇవ్వబడుతుందని, ల్యాప్ టాప్, లక్కీ డిప్ కూపన్‌ల కోసం, ఉచిత బస్‌పాస్ మరియు ఇతర వివరాల కోసం ఒంగోలు అంజయ్య రోడ్డులోని బ్రిలియంట్ ఇన్‌స్టిట్యూట్‌లో సంప్రదించాలన్నారు. ప్రవేశం ఉచితం అని తెలిపారు. ఈ విలేకరులు సమావేశంలో సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ తహూర, కోర్స్ కో ఆర్డినేటర్ కోటేశ్వరరావు, డైరెక్టర్ ఆకీల్, ఈవెంట్ మేనేజర్ నాగార్జున పాల్గొన్నారు.

అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు

ప్రజాశక్తి-కనిగిరి

కనిగిరి ఆర్టీసీ బస్ స్టేషన్ పరిధిలోని షాపులను డిపో మేనేజర్ మహమ్మద్ సయానా బేగం సోమవారం తనిఖీ చేశారు. నందిని స్టాల్స్‌లో ఐటమ్స్ యొక్క ఎమ్మార్పీ ధరలను పరిశీలించారు. ఎమ్మార్పీ కంటే అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఎంక్రోచ్మెంట్స్‌ని కూడా తొలగించవలసినదిగా స్టాల్ ఓనర్స్‌కు సూచించారు. ప్రయాణికులకు డిపో ప్రాంగణంలో మౌలిక వసతులు, డ్రింకింగ్ వాటర్, మరియు బస్‌స్టేషన్ నీట్‌నెస్ పరిశీలించి కాంట్రాక్టర్‌కు పలు సూచనలు ఇచ్చారు. ప్రయాణికులకు అసౌకర్యం కలిగించినా నిబంధనలు ఉల్లంఘించినా కఠిన చర్యలు తీసుకుంటామని డిపో మేనేజర్ షాపుల యజమానులను హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఆర్టీసీ సిబ్బంది పాల్గొన్నారు.

తనిఖీ చేస్తున్న డిపో మేనేజర్ మహమ్మద్ సయానా బేగం

మృతదేహాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

బైక్‌ను ఢీకొన్న కంటెయినర్ యువకుడు మృతి

ప్రజాశక్తి-అద్దంకి

వేగంతో వస్తున్న ద్విచక్రవాహనాన్ని ఢీకొనడంతో యువకుడు అక్కడకక్కడే మృతి చెందిన ఘటన సోమవారం పట్టణంలోని పోతురాజు గండి సమీపంలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. బల్లికురవ మండలం వి.కొప్పెరపాడు గ్రామానికి చెందిన ముద్దపాటి రాజేష్ (16) బంధువులు పట్టణంలో అల్పాహారశాల నిర్వర్తిస్తున్నారు. రాజేష్ అక్కడకు బైక్‌పై వస్తుండగా వేగంగా వస్తున్న కంటెయినర్ ఢీకొట్టింది. దీంతో కంటెయినర్ కింద పడి అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న సీఐ సుబ్బరాజు అక్కడికి చేరుకొని ట్రాఫిక్ అంతరాయం లేకుండా చర్యలు చేపట్టారు. ప్రమాదానికి కారణమైన కంటైనర్ డ్రైవర్ పోలీస్ స్టేషన్లో స్వచ్ఛందంగా లొంగిపోయాడు. పోస్టుమార్టం నిమిత్తం యువకుడి మృతదేహాన్ని పోలీసులు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

దాడుల్లో పాల్గొన్న విద్యుత్ అధికారులు

విద్యుత్ విజిలెన్స్ దాడులు

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

విద్యుత్ విజిలెన్స్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఉషారాణి, ఆపరేషన్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ హరిబాబు ఆధ్వర్యంలో సోమవారం నాడు ఒంగోలులో విజిలెన్స్ దాడులు నిర్వహించారు. అనధికారికంగా లోడు వాడుతున్న 126 సర్వీస్‌లను, తప్పు కేటగిరీలో వాడుతున్న ఒక సర్వీస్‌ను గుర్తించారు. రూ.6,06,750 అపరాధ రుసుం విధించారు. తనిఖీలలో ముగ్గురు డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు, 11 మంది ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు, డివిజన్‌లోని సిబ్బంది పాల్గొన్నారు.

జగనన్న పోరుబాటను జయప్రదం చేయండి

ఏర్పాట్లు పరిశీలించిన బూచేపల్లి శివప్రసాద్ రెడ్డి

ప్రజాశక్తి-పొదిలి

జగనన్న పోరుబాట కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ప్రకాశం జిల్లా వైసీపీ అధ్యక్షులు, దర్శి ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాద్ రెడ్డి కోరారు. సోమవారం స్థానిక దర్శి రోడ్డులోని హెలిప్యాడ్ వద్ద ఏర్పాట్లను ఆయన నాయకులతో కలిసి పర్యవేక్షించారు. కార్యక్రమానికి వచ్చే ప్రజలకు భోజన ఏర్పాట్లను, పార్కింగ్ వసతులను పరిశీలించారు. హెలిపాడ్ వద్ద భూమి చదును చేసి ట్యాంకర్లతో నీటిని చల్లించి అవసరమైన చోట చిప్స్ కంకర్ తోలించారు. నియోజకవర్గ

ఏర్పాట్లు పర్యవేక్షిస్తున్న వైసిపి నాయకులు

వాల్‌పోస్టర్లు ఆవిష్కరిస్తున్న నాయకులు

సమన్వయకర్త గిద్దలూరు మాజీ ఎమ్మెల్యే అన్నా రాంబాబు పర్యవేక్షణ ఏర్పాట్ల గురించి చర్చించారు. పొగాకు రైతులతో మాట్లాడి ఎక్కువ మంది రైతులు వారి సమస్యలను జగన్ వివరించేలా అవసరమైన చర్యలు తీసుకునేందుకు ఆయా గ్రామాల వారీగా నాయకులతో చర్చించారు. ముందుగా మాజీ ఎమ్మెల్యే అన్నా వెంకట రాంబాబు, జిల్లా పరిశీలకులు బత్తుల బ్రహ్మానందరెడ్డి, రాష్ట్ర కార్యదర్శి కసిరెడ్డి వెంకట రమణారెడ్డి ఇతర ముఖ్య నాయకులతో కలిసి జగనన్న పోరుబాట ప్రచార కరపత్రాన్ని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు అన్నా కృష్ణ చైతన్య, సానికొమ్ము శ్రీనివాస్ రెడ్డి, గొలమారి చెన్నారెడ్డి, సాయి రాజేశ్వరరావు, గుజ్జుల సంజీవరెడ్డి, వై.వెంకటేశ్వరరావు, కొండ్రగుంట సుబ్బారావు, బొట్ల రాంబాబు, జి.శ్రీను, షేక్ రబ్బానీ, తూము బాల్ రెడ్డి, కొత్తపులి బ్రహ్మారెడ్డి, వర్షం ఫిరోజ్, రాములవీడు శ్రీను, గుంటూరి పిచ్చిరెడ్డి, ముల్లా బ్రదర్, పేరం సుభాష్ చంద్రబోస్ రెడ్డి, వెంకటేశ్వర రెడ్డి, దర్శి, తాళ్లూరు మండలాల నాయకులు కె.వి.రెడ్డి, వైసిపి నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

కొండపి: జగనన్న రైతు పోరుబాట కార్యక్రమంను విజయవంతం చేయాలని మండల కన్వీనర్ బచ్చల కోటేశ్వరరావు పిలుపునిచ్చారు. సోమవారం సాయంత్రం కొండపిలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. పొగాకు రైతు గిట్టుబాటు ధర లేక రోడ్డు ఎక్కుతుంటే ప్రభుత్వం కనీసం స్పందించట్లేదని అన్నారు. గతంలో వైసీపీ అధికారంలో ఉన్నప్పుడు మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి మార్క్‌ఫెడ్ ద్వారా పొగాకును కొనుగోలు చేసి రైతాంగాన్ని ఆదుకున్నారని తెలిపారు. మండలంలోని వైస్ ఎంపీపీలు, జడ్పిటిసి, సర్పంచులు, నాయకులు, వేలాదిగా పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జేసిఎస్ కన్వీనర్ గొట్టిపాటి మురళి, ఎగ్జిక్యూటివ్ మెంబర్ ఎం.నారాయణ, సీనియర్ నాయకులు వేముల రమేష్, రామయ్య, కోయవారిపాలెం, సుబ్బు, దివి పిచ్చయ్య, కొర్నేలు, సురేంద్ర, శ్రీనివాస్, నజీర్, తదితరులు పాల్గొన్నారు.

ముప్పా సురేష్ ఇంట్లో సోదాలు నిర్వహిస్తున్న ఎస్ఐ

వీరయ్య చౌదరి హత్యకేసులో నిందితుడు ముప్పా సురేష్ ఇంట్లో సోదాలు

ప్రజాశక్తి-నాగులుప్పలపాడు

మండలంలోని అమ్మనబ్రోలు గ్రామానికి చెందిన మాజీ ఎంపిపి ముప్పవరపు వీరయ్య చౌదరి హత్య కేసుకు సంబంధించి విచారణాధికారి ఆదేశాల మేరకు సోమవారం స్థానిక పోలీస్ స్టేషన్ ఎస్ఐ షేక్ రజియా సుల్తానా తమ సిబ్బందితో కలిసి సోమవారం ముప్పా సురేష్ ఇంటిలో సోదాలు నిర్వహించారు. అమ్మనబ్రోలు గ్రామంలో ముప్పా సురేష్ ఇంట్లో సదరు ముప్పా సురేష్‌తో పాటు మిగిలిన నిందితులకు సంబంధించి నగదు లావాదేవీలు గురించి ఆధారాలు, ముఖ్యమైన పత్రాల కోసం సోదాలు నిర్వహించారు.

ఆ చట్టాలను పునరుద్ధరించాలి

జర్నలిస్టుల పెండింగ్ సమస్యలు పరిష్కరించాలని కలెక్టరేట్ వద్ద ఏపీడబ్ల్యూజేఎఫ్ ధర్నా

ప్రజాశక్తి - ఒంగోలు కలెక్టరేట్

కేంద్ర ప్రభుత్వం రద్దు చేసిన కార్మిక చట్టాల్లో వర్కింగ్ జర్నలిస్టులకు సంబంధించిన రెండు చట్టాలను పునరుద్ధరించాలని ఎపిడబ్ల్యూజెఎఫ్ నేతలు డిమాండ్ చేశారు. ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్టు ఫెడరేషన్ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఒంగోలు కలెక్టరేట్ వద్ద జర్నలిస్టులు ధర్నా సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా జర్నలిస్టు ఫెడరేషన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఎస్‌కె చిన కరీముల్లా, దాసరి సునీల్ మాట్లాడుతూ కార్మిక చట్టాలను రద్దు చేస్తూ కేంద్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని నిరసిస్తూ ఆందోళన వ్యక్తం చేశారు. రద్దయిన కార్మిక చట్టాల్లో వర్కింగ్ జర్నలిస్టులకు సంబంధించిన రెండు చట్టాలు ఉన్నాయని అన్నారు. అవి వర్కింగ్ జర్నలిస్టుల చట్టం 1955, వేతన చెల్లింపు చట్టం 1958 అని తెలిపారు. వర్కింగ్ జర్నలిస్టుల వృత్తి ప్రమాణాలు కాపాడేందుకు, వేతనాల చెల్లింపుకు, ఇతర సదుపాయాలు, వేతన బోర్డు ఏర్పాటుకు సంబంధించిన అంశాలపై ఈ చట్టాలు వర్కింగ్ జర్నలిస్టులకు తోడ్పడతాయని అన్నారు. ఈ చట్టాల రద్దుతో జర్నలిస్టు వృత్తి ప్రమాణాలకు విఘాతం కలగడంతో పాటు వేతన చెల్లింపులకు సంబంధించిన అంశాలు ప్రస్తావనకు రాకుండా పోతాయన్నారు. ఈపాటికే వర్కింగ్ జర్నలిస్టులు యాజమాన్యాల నుంచి చట్టబద్ధమైన రక్షణ లేకపోవడంతో అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారని అన్నారు. ఈ పరిస్థితులన్నింటినీ దృష్టిలో పెట్టుకొని వర్కింగ్ జర్నలిస్టుల కోసం ఉన్న ఈ రెండు చట్టాలు పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. మీడియాను ఒకే చట్ట పరిధిలోకి తెచ్చే విధంగా సరికొత్త చట్టాలు రూపొందించాల్సింది పోయి ఉన్న చట్టాలు రద్దు చేయడం ఎంత మాత్రం సరైనది కాదన్నారు. కేంద్ర ప్రభుత్వం వెంటనే రద్దు చేసిన కార్మిక చట్టాలు పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. జిల్లా మాజీ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు గొట్టిపాటి నాగేశ్వరరావు, ఎస్‌వి బ్రహ్మం మాట్లాడుతూ జర్నలిస్టులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని అన్నారు. అర్హులైన జర్నలిస్టులందరికీ ఇంటి స్థలాలు ఇచ్చి ఇల్లు కట్టించాలని డిమాండ్ చేశారు. అర్హులైన జర్నలిస్టులకు అక్రిడిటేషన్ కార్డులు ఇవ్వాలని కోరారు. జర్నలిస్టులపై జరిగే దాడుల నిరోధించేందుకు అటాక్స్ కమిటీని ఏర్పాటు చేయాలన్నారు. అనంతరం సంయుక్త కలెక్టర్ ఆర్ గోపాలకృష్ణను కలిసి వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో ఎపిడబ్ల్యూజెఎఫ్ జిల్లా గౌరవ అధ్యక్షులు వి భక్తవత్సలం, మాజీ అధ్యక్షులు ఆర్‌వి రాజశేఖర్, జిల్లా ఉపాధ్యక్షులు యు రాజశేఖర్, కార్యదర్శి ఎస్‌కె ఖుషిద, మీడియా కెమెరామెన్ అసోసియేషన్ అధ్యక్షులు వి నాగేశ్వరరావు, పి9 టివి మేనేజింగ్ డైరెక్టర్ పి కిరణ్ కుమార్, ఎపిడబ్ల్యూజెఎఫ్ దర్శి నియోజకవర్గ కార్యదర్శి ఎం బ్రహ్మయ్య, బైరపనేని శ్రీనివాసరావు, బాలాజీ కుమార్ పాల్గొన్నారు.

జెసి గోపాలకృష్ణకు వినతి పత్రం అందజేస్తున్న జర్నలిస్టులు

స్టీల్‌ప్లాంట్ కార్మికులను విధుల్లోకి తీసుకోవాలి

ప్రజాశక్తి - అద్దంకి

విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ సొంత ఐరన్ ఓర్ గనులు కేటాయించాలని డిమాండ్ చేస్తూ ఆందోళన చేస్తున్న కార్మికులను విధుల నుండి తొలగించిడం దుర్మార్గమని, కాంట్రాక్టు కార్మికులను తిరిగి విధుల్లోకి తీసుకోవాలని సిఐటియు ఆధ్వర్యంలో పట్టణంలో నిరసన ర్యాలి సోమవారం నిర్వహించారు. నిరవధిక ఆందోళన నిర్వహిస్తున్న విశాఖ ఉక్కు కార్మికులకు మద్దతుగా సిఐటియు ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. సిఐటియు రాష్ట్ర వ్యాప్త పిలుపులో భాగంగా జరిగిన నిరసన సందర్భంగా సిఐటియు కార్యదర్శి తంగరాల వెంకటేశ్వర్లు మాట్లాడారు. రాష్ట్రంలో ప్రతిష్టాత్మకమైన విశాఖ ఉక్కు ఫ్యాక్టరీని కాపాడుకోవాలని అన్నారు. ప్రైవేటు యజమానులకు కట్టబెట్టే ప్రయత్నాన్ని అడ్డుకోవాలని కోరారు. విశాఖ ఉక్కు కార్మిక సంఘాలు 36నెలలుగా ఆందోళన నిర్వహిస్తున్నప్పటికీ పాలకులకు చీమైనా కుట్టినట్లు లేదన్నారు. ఉద్యమాన్ని నీరుగార్చేందుకు కొంత మంది కార్మికులను ఇతర ప్రాంతాలకు బదిలీ చేయడం, 5400 మంది కాంట్రాక్టు కార్మికులను తొలగించటం కేంద్రంలోని బిజెపి ప్రభుత్వ దుర్మార్గ చర్యని అన్నారు. రాష్ట్రంలో వేల మంది కార్మికులకు ఉపాధి అందిస్తూ నాణ్యమైన ఉక్కు ఎగుమతి చేయటంలో విశాఖ ఉక్కు అగ్ర పీఠాన ఉందని అన్నారు. పాలకవర్గం దానిని ప్రైవేటు వ్యక్తుల చేతుల్లో పెట్టేందుకు దుర్మార్గమైన చర్యలు తీసుకుంటూ నష్టాల బాట పట్టించారని విమర్శించారు. విశాఖ ఉక్కు గేటు వద్ద ఉన్న నిరసన దీక్ష శిబిరాన్ని అత్యుత్సాహంతో పోలీసులు ధ్వంసం చేశారని ఆరోపించారు. 50మంది పైబడి కార్మికులను అరెస్టు చేసిన చర్యకు నిరసనగా రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలు జరుగుతున్నాయని అన్నారు. రాష్ట్ర ప్రజల కోసం, త్యాగాలతో సాధించుకున్న ఉక్కు ఫ్యాక్టరీని కాపాడుకోవడం కోసం, రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం కేంద్రంపై ఒత్తిడి చేసి నిధులు, గనులను సాధించాలని కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు భీష్మ, ఆదాము, వీరయ్య, నాగేశ్వరరావు తోపాటు మున్సిపల్ కార్మికులు పాల్గొన్నారు.

ధర్నా నిర్వహిస్తున్న సిఐటియు, కార్మికులు

నూతన రేషన్ షాప్ ఏర్పాటు చేయాలి

ప్రజాశక్తి - రేపల్లె

పీఎంవై ఎన్టీఆర్ నగర్‌లో కొత్తగా రేషన్ షాపు ఏర్పాటు చేయాలని కోరుతూ సిపిఎం పట్టణ కార్యదర్శి సిహెచ్ మణిలాల్ కోరారు. తహశీల్దారు ఎం శ్రీనివాసరావుకు గ్రీవెన్స్‌లో సోమవారం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా మణిలాల్ మాట్లాడుతూ రేషన్ షాప్ ఏర్పాటు చేసే వరకు తాత్కాలికంగా ఏదో ఒక షాపు డీలర్ ద్వారా ఎన్టీఆర్ నగర్ నందు స్థానికంగా రేషన్ అందించాలని కోరారు. ఎండియు వాహనాలు రద్దు వల్ల పట్టణంలో నూతనంగా ఏర్పడిన ఎన్టీఆర్ నగర్లో నివాసం ఉంటున్న ప్రజలకు రేషన్ తీసుకోవటానికి షాపు లేకపోవడంతో ఇంతకు ముందు నివాసం ఉంటున్న వార్డుల పరిధిలో అంటే పట్టణంలో 28 వార్డుల్లోని ప్రజలు వాళ్లు గతంలో నివసించిన వార్డు పరిధిలోకి వెళ్లి రేషన్ కార్డులు కలిగి ఉన్న చోటికి రేషన్ తెచ్చుకోవడం ఇబ్బందిగా మారిందని తెలిపారు. రవాణా చార్జీలు ఎక్కువ అవుతున్నాయని తెలిపారు. 65ఏళ్లు దాటి వృద్ధాప్యంలో ఉన్నవాళ్లకి స్థానికంగా రేషన్ కార్డు కలిగిన వార్డులో నివాసం ఉండటం లేదని డీలర్లు ఇళ్లకు తీసుకువచ్చి రేషన్ అందించడం లేదని తెలిపారు. దీనితోటి కార్డు కలిగిన షాపు వద్దకు వృద్ధులు వెళ్లి రేషన్ తెచ్చుకోవాల్సిన పరిస్థితి ఏర్పడిందని తెలిపారు. కావున వెయ్యి కుటుంబాలు నివాసం ఉంటున్న నేపథ్యంలో పీఎంఓ ఎన్టీఆర్ నగర్ (పాత జగన్ కాలనీ)లో పూర్తి వివరాలు సేకరించి నూతనంగా రేషన్ షాపు ఏర్పాటు చేయాలని అన్నారు. స్పందించిన తహసిల్దార్ ప్రజలకు ఇబ్బంది లేకుండా తాత్కాలికంగా రేషన్ అందించేలా ఏర్పాటు చేస్తామని చెప్పారు. ఉన్నత అధికారులు దృష్టికి తీసుకువెళ్లి కొత్త రేషన్ షాప్ ఏర్పాటు అవకాశాలు, నిబంధనలు మేరకు ఏర్పాటు చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో పిఎంఓ ఎన్టీఆర్ నగర్ అభివృద్ధి కమిటీ కన్వీనర్ వి ధనమ్మ, సహాయ కార్యదర్శి కె నాంచారమ్మ, కమిటీ నాయకులు శ్రీనివాసరావు, కె వీరాంజనేయులు, సుధా దేవి, గౌసే పాల్గొన్నారు.

తహశీల్దారుకు అర్జీ ఇస్తున్న సిపిఎం కార్యదర్శి మణిలాల్

గ్రామంలో ప్రచారం నిర్వహిస్తున్న సిఐటియు కార్యకర్తలు

ప్రభుత్వ పాఠశాలను కాపాడుకుందాం

ప్రజాశక్తి - పంగులూరు

'మన ఊళ్లో ప్రభుత్వ పాఠశాలను కాపాడుకుందాం' అంటూ సిఐటియు ఆధ్వర్యంలో బైట మంజులూరులో సోమవారం రాత్రి ఇంటింటికీ తిరిగి ప్రచారం చేశారు. పిల్లలను ప్రభుత్వ పాఠశాల్లోనే చేర్పండి అంటూ క్యాంపియన్ చేశారు. ఈ సందర్భంగా సిఐటియు గ్రామ కార్యదర్శి డి ఆదిశేషం రాజు మాట్లాడుతూ గ్రామంలో అనేక ఏళ్లుగా ఉత్తమ పౌరులుగా అనేక మందిని తయారు చేసిన ప్రభుత్వ నేడు సరైన విద్య బోధన లేక, మూతపడే పరిస్థితి వచ్చిందని, దీనిని కాపాడుకోవాల్సిన బాధ్యత గ్రామస్తులైన తమపై ఉందని అన్నారు. గ్రామంలో ప్రభుత్వ పాఠశాల లేకపోతే గ్రామాభివృద్ధి ఉండదని తెలిపారు. గ్రామంలో అనేక అనర్థాలకు దారి తీస్తుందని అన్నారు. దీనికి గ్రామంలో పెద్దల సహకారంతో సిఐటియు ఆధ్వర్యంలో 1నుండి 5వ తరగతి చదివే పిల్లలను ప్రభుత్వ పాఠశాల్లోనే చేర్చాలని కోరుతున్నామని తెలిపారు. వారికి మెరుగైన విద్యా బోధన చేయడంలో గ్రామ పెద్దలు సహకారంతో రాబోయే కాలంలో కృషి చేస్తామని అన్నారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు ఎస్ లక్ష్మణ్‌రాజు, సిఐటియు గ్రామ అధ్యక్షులు మహేష్, గ్రామ కమిటీ సభ్యులు సిహెచ్ నాగమణి, బి సుజాత, శ్రీదేవి పాల్గొన్నారు.

వినతులు స్వీకరిస్తున్న ఆర్‌డిఒ రామలక్ష్మి

ఆరువినతులు స్వీకరణ

ప్రజాశక్తి - రేపల్లె

ఆర్‌డిఒ కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో అర్జీదారుల నుంచి ఆర్డీఓ ఎన్ రామలక్ష్మి వినతులు సోమవారం స్వీకరించారు. సబ్ డివిజన్ వ్యాప్తంగా అర్జీదారుల నుంచి దరఖాస్తులు స్వీకరించామని ఆర్డీఓ తెలిపారు. ఆయా సమస్యలు నిర్ణీత గడువులోపు పరిష్కారం అయ్యేలా చూడాలని అధికారులను ఆమె ఆదేశించారు. ఈ సందర్భంగా 6 అర్జీలు వచ్చాయని తెలిపారు.

బాధ్యతలు తీసుకుంటున్న వెంకటేశ్వర్లు

ఉపాధ్యాయునిగా వెంకటేశ్వరరావు బాధ్యతల స్వీకరణ

ప్రజాశక్తి - బట్టిప్రోలు

ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (యుటిఎఫ్) రాష్ట్ర అధ్యక్షులు నక్క వెంకటేశ్వర్లు మండలంలోని వెల్లటూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల్లో ఉపాధ్యాయునిగా సోమవారం బాధ్యతలు చేపట్టారు. పాఠశాల హెచ్ఎం కర్ర అరుణకుమారి ఆధ్వర్యంలో బదిలీ పత్రాన్ని అప్పగించి విధుల్లో చేరారు. ఐలవరం గ్రామానికి చెందిన ఆయన యుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షునిగా ఉంటూ మండలంలోని వెల్లటూరులో ఉపాధ్యాయులుగా బాధ్యతలు చేపట్టడం పట్ల యుటిఎఫ్ మండల నాయకులు హర్షం వ్యక్తం చేశారు. ఉపాధ్యాయుల సమస్యలపై నిరంతరం పోరాడే ఉన్నతమైన వ్యక్తి మండలంలో ఉండటం తమకు గర్వకారణంగా ఉందని పేర్కొన్నారు.

చందలూరు హైస్కూల్లో కలుసుకున్న పూర్వ విద్యార్థులు

పూర్వ విద్యార్థుల అపూర్వ సమ్మేళనం

ప్రజాశక్తి - పంగులూరు

మండలంలోని చందలూరులోని జెడ్‌పి ఉన్నత పాఠశాల విద్యార్థుల అపూర్వ సమ్మేళనం ఆదివారం ఘనంగా జరిగింది. 2000-05 సంవత్సరం బ్యాచ్ విద్యార్థులు ఆత్మీయంగా కలుసుకున్నారు. 6వ తరగతి నుండి 10వ తరగతి వరకు చదివిన విద్యార్థులు 20ఏళ్ల తర్వాత కలుసుకొని ఒకరినొకరు యోగక్షేమాలు తెలుసుకున్నారు. చదివిన బడి, పరిసరాలు చూసి చిన్ననాటి జ్ఞాపకాలు గుర్తు చేసుకొని భావోద్వే గానికి గురయ్యారు. నాడు గురువులు నేర్పిన చదువు క్రమశిక్షణతో ఈరోజు వివిధ స్థాయిల్లో ఉన్నామని తెలిపారు. ఈ సందర్భంగా వారికి చదువు చెప్పిన గురువులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు చందలూరు గిరిజ, విశ్రాంత ఉపాధ్యాయులు మోపత్తి వెంకటరావు, నార్ని తాతయ్య, పాఠశాల దాతల కుటుంబ సభ్యులైన అడ్డగడ సుబ్బయ్య, పెంట్యాల వాసుబాబు, అజిత్ కుమార్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ వడ్డవల్లి వీరనారాయణ, ఉపాధ్యాయులు, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

వైకల్యమున్న పిల్లల్ని భవితలో చేర్చాలి

ప్రజాశక్తి - పర్చూరు

గ్రామాల్లో ప్రత్యేక అవసరాలున్న పిల్లలు ఎవరైనా ఉంటే భవిత సెంటర్లో చేర్పించాలని ఐఆర్టీలు ఎం గీతాంజలి, పి చంద్రిక కోరారు. ప్రత్యేక అవసరాలు కలిగిన పిల్లల కొరకు సర్వే చేస్తున్నట్లు చెప్పారు. అడుసుమల్లిలో మాట్లాడుతూ 18 ఏళ్లలోపు ప్రత్యేక అవసరాలు గల పిల్లల్ని తల్లి, దండ్రులు శ్రద్ధ చూపాలని చెప్పారు. అలాంటి పిల్లలపై అశ్రద్ధ చేయకుండా భవిత కేంద్రాల్లో చేర్పించి వారి భవిష్యత్తుకు బంగారు బాట వేయాలని కోరారు. ప్రభుత్వం అందజేస్తున్న సంక్షేమ పథకాలు వినియోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో ప్రత్యేక అవసరాలు ఉన్న పిల్లల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ప్రత్యేక అవసరాల పిల్లల సర్వే చేస్తున్న ఐఆర్టీలు

పిడిసిసి బ్యాంకు పురోభివృద్ధికి సహకరిస్తా

- ఎమ్మెల్యే దామచర్ల జనార్ధన్ రావు
- అట్టహాసంగా డాక్టర్ సీతారామయ్య ప్రమాణ స్వీకారం

డాక్టర్ సీతారామయ్యకు జ్ఞాపిక అందజేస్తున్న ఎమ్మెల్యే దామచర్ల

ప్రజాశక్తి ఒంగోలు కలెక్టరేట్

పిడిసిసి పురోభివద్ధికి సహకరిస్తానని ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ రావు పేర్కొన్నారు. పిడిసిసి బ్యాంకు ఛైర్మన్‌గా డాక్టర్ కామేపల్లి సీతారామయ్య సోమవారం ప్రమాణస్వీకారం చేశారు. ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్ధనరావు,సంతనూతలపాడు ఎమ్మెల్యే విజయ కుమార్ డాక్టర్ సీతారామయ్యతో ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ సందర్భంగా జనార్ధన్ మాట్లాడుతూ మంచి మనుస్సున్న మనిషి సీతారామయ్య అని కొనియాడారు. క్రమ శిక్షణతో కూడిన వ్యక్తి ఇలాంటి పదవిలో ఉండటం వల్ల రైతులందరికీ న్యాయం జరుగుతోందన్నారు. నిర్వీర్యమైన పిడిసిసి బ్యాంకు పుర్వ వైభవానికి కషి చేయాలని సూచించారు. తన నుంచి ఎలాంటి రాజకీయ ఒత్తిళ్ళు ఉండవనీ బ్యాంకు పురోగాభివద్ధికి తన వంతు సహాయ సహకారాలు అందిస్తానని తెలిపారు. సంతనూతలపాడు ఎమ్మెల్యే విజయ కుమార్ మాట్లాడుతూ పిడిసిసి బ్యాంకును మళ్లీ అభివద్ధి పథంలో నడిపించాలని సూచించారు. రైతులకు అన్నీ విధాలుగా మేలు జరిగేలా, బ్యాంకు లక్ష్యాలకు అనుగుణంగా వినూత్న ఆలోచనలతో ముందుకు సాగాలని పేర్కొన్నారు. లైవ్ స్టాక్ డెవలప్మెంట్ ఏజెన్సీ ఛైర్మన్ షేక్ రియాజ్ మాట్లాడుతూ 2025 ఎన్నికల్లో దామచర్ల గెలుపుకు సీతారామయ్య ఎంత కష్టపడ్డారో తాను దగ్గర ఉండి చూశానన్నారు. పార్టీ కోసం నిబద్ధతతో పని చేసిన సీతారామయ్యకు పిడిసిసి బ్యాంకు ఛైర్మన్ గా అవకాశం లభించడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. ఈ సందర్భంగా అన్నీ నియోజకవర్గాల ముఖ్య నేతలు, రైతులు, అభిమానులు అత్యధిక సంఖ్యలో తరలివచ్చి సీతారామయ్యకు పుష్ప గుచ్చాలు అందజేసి భాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మేయర్ గంగాడ సుజాత, శ్రీహర్షిణీ విద్యా సంస్థల అధినేత గోరంట్ల రవికుమార్, జనసేన నాయకులు కంది రవిశంకర్ తదితరులు పాల్గొన్నారు.

ఉసా వెంకటేశ్వర్లును పరామర్శిస్తున్న వి. శ్రీనివాసరావు

వెంకటేశ్వర్లుకు వీఎస్ఆర్ పరామర్శ

ప్రజాశక్తి- సిఎస్‌పురం రూరల్

సిపిఎం నాయకులు ఊసా వెంకటేశ్వర్లు కుమారుడు హర్ష వర్ధన్ గత గురువారం రాత్రి మతి చెందిన విషయం తెలిసిందే. అందులో భాగంగా ఉసా వెంకటేశ్వర్లు, ఆయన సతీమణి రాజ్యలక్ష్మి దంపతులను సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎస్‌డి.హనీఫ్, రమేష్ సోమవారం పరామర్శించారు. ఊసా కుటుంబాన్ని పరామర్శించిన వారిలో సిపిఎం మండల నాయకులు సన్నపురెడ్డి తిరుపతిరెడ్డి, బక్క జేసురత్నం, గుర్రం లక్ష్మయ్య, తులసిరావు, ఓబుల్ రెడ్డి, టిడిపి ఆనికాలపల్లి గ్రామ కమిటీ అధ్యక్షుడు యడవల్లి నారాయణరెడ్డి తదితరులు ఉన్నారు.

పన్నుల పెంపు కోసం చేపట్టిన ఇంటింటి సర్వేను ఆపాలి : సిపిఎం

ప్రజాశక్తి - ఒంగోలు సిటీ : ఇంటి పన్నులు పెంపు కోసం ఒంగోలు నగరంలో చేపట్టిన ఇంటింటి సర్వేను వెంటనే ఆపాలని సిపిఎం నగర కార్యదర్శి చీకటి శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. ఈ ఆర్థిక సంవత్సరం ఏప్రిల్‌లో 15శాతం ఆస్తి పన్ను పెంచిన కార్పొరేషన్, నెల తిరక్కుండానే మరో 20 శాతం పన్నులు పెంచేందుకు సర్వే చేపట్టినట్లు ఆయన దుయ్య బట్టారు. 20 శాతం పన్నులు పెంచడం ద్వారా రూ.8,500 కోట్లు వసూలుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు ఆయన ఆరోపించారు. ఈ ఆర్థిక సంవత్సరం లోనే ఏకంగా 35 శాతం పన్నుల భారం మోపుతున్నట్లు విమర్శించారు. గత వైసిపి ప్రభుత్వం ఇంటి పన్నులు అద్దె విలువ ప్రాతిపదికపై ఉన్న విధానాలను మార్చి ఆస్తి విలువ ఆధారంగా పన్ను విధించే నూతన చట్టాన్ని జీవో నంబర్ 198 తెచ్చినట్లు గుర్తు చేశారు. కూటమి పార్టీలు ఎన్నికల మేనిఫెస్టోలో ఆస్తి విలువ ఆధారిత పన్ను విధానాన్ని సమీక్షిస్తామని, పన్నుల భారాలను మోపబోమని ప్రజలకు ఇచ్చిన హామీని విస్మరించినట్లు ఆరోపించారు. జిల్లాలో 7 మున్సిపాలిటీలో సుమారు రూ.14 వేల కోట్ల రూపాయల పన్నులు భారం ప్రజలపై పడుతుందన్నారు. సర్వే ఆధారంగా అదనంగా చిన్న గది కట్టినా ,రేకుల షెడ్డు నిర్మించిన,చిరు వ్యాపారం చేసుకుంటున్న నిబంధనల సాకుతో ఆస్తి విలువ ఆధారంగా పన్ను విధిస్తారని తెలిపారు. ఇంటి ప్లాను లేకపోయినా, ప్లాను ఉండి అదనపు నిర్మాణాలు చేపట్టినా 25 శాతం నుంచి 100 శాతం వరకూ అదనపు పెనాల్టీ విధిస్తారని తెలిపారు. ఒంగోలు నగరంలో సుమారు 80 వేల గహాలు ఉన్నాయని, ఇంటింటి సర్వే చేసి పన్నుల భారాలు వేయడానికి సిద్ధ పడుతున్నారని తెలిపారు. ఇప్పటికే పెరిగిన ఆస్తి పన్నులు,విద్యుత్ భారాలు, నిత్యావసర వస్తువుల ధరలతో ప్రజలు సతమత మవుతున్నారని తెలిపారు. ఈ నేపథ్యంలో ఇంటి పన్నులు పెంచేందుకు తలపెట్టిన సర్వేను ఉపసంహరించాలని ఆయన డిమాండ్ చేశాడు.

అర్జీలను పరిష్కరించాలి : ఎస్‌పి

ప్రజాశక్తి - బాపట్ల జిల్లా

జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో ఎస్‌పి తుషార్ డూడి ఆధ్వర్యంలో పిజిఆర్ఎస్ కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా కుటుంబ సమస్యలు, అత్తారింటి వేధింపులు, ఆర్థిక మోసాలు, భూవివాదాలు తదితర సమస్యలపై ప్రజలు అర్జీలు అందజేశారు. ఎస్‌పి అర్జీదారులకు ముఖాముఖీ మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అర్జీలపై చట్ట ప్రకారం విచారణ జరిపి, త్వరితగతిన సమస్యలను పరిష్కరించి బాధితులకు న్యాయం చేస్తామని ఎస్‌పి భరోసా కల్పించారు. అర్జీలను క్షుణ్ణంగా పరిశీలించారు. సంబంధిత పోలీస్ అధికారులతో ఫోన్ లో మాట్లాడి అర్జీలను విచారించి చట్ట పరిధిలో పరిష్కరించాలని ఆదేశించారు. పిజిఆర్ఎస్‌కి మొత్తం 36 అర్జీలు వచ్చాయి.ఈ కార్యక్రమంలో సిసిఎస్ డిఎస్‌పి పి.జగదీష్ నాయక్, పిజిఆర్ఎస్ సెల్ ఇన్‌స్పెక్టర్ యు.శ్రీనివాసులు, పోలీస్ అధికారులు పాల్గొన్నారు.

నగదు బదిలీ ఆలోచనను విరమించుకోవాలి

వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కంకణాల ఆంజనేయులు

మాట్లాడుతున్న కంకణాల అంజనేయులు

ప్రజాశక్తి -ఒంగోలు సిటీ

ప్రజా పంపిణీలో నగదు బదిలీ ప్రవేశపెట్టాలన్న రాష్ట్ర ప్రభుత్వ ఆలోచనలను తక్షణమే విరమించుకోవాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కంకణాల ఆంజనేయులు డిమాండ్ చేశారు. స్థానిక ప్రజాసంఘాల కార్యాలయంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కమిటీ సమావేశం జిల్లా అధ్యక్షుడు నేరుసుల వెంకటేశ్వర్లు అధ్యక్షతన సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆంజనేయులు మాట్లాడుతూ ప్రజాపంపిణీ వ్యవస్థను పటిష్టం చేయాలన్నారు. 2013 ఆహార భద్రత చట్టం ప్రకారం 14 రకాల నిత్యావసర వస్తువులు ప్రతి పేద కుటుంబానికి అందేలా చర్యలు తీసుకోవాలన్నారు. గత ప్రభుత్వం మాదిరిగానే ఎండియు వాహనాల ద్వారా రేషన్ పంపిణీ కొనసాగించాలని డిమాండ్ చేశారు. రేషన్ షాపుల వద్ద కూడా నిత్యావసర సరుకులు అందించాలని కోరారు. ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా ఇస్తున్న బియ్యం ఎవరూ తినడం లేదని, బ్లాక్ మార్కెట్‌కు చేరుతున్నాయని, రేషన్ బియ్యం పక్కదారి పడుతున్నాయని దాన్ని సరిచేసేందుకే ఈ చర్యలు తీసుకుంటున్నట్లు ప్రభుత్వం పేర్కొనడం సిగ్గుచేటన్నారు. బియ్యం అక్రమ రవాణాను, బ్లాక్ మార్కెట్‌ను అరికట్టడం చేతగాని ప్రభుత్వం కల్లబొల్లి కబుర్లు చెబుతుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. అధికారంలో ఏ పార్టీ ఉంటే వారి అనుయాయులు ఈ అక్రమ వ్యవహారంలో ఉంటున్న విషయం బహిరంగ రహస్యమేనన్నారు. వారే బియ్యాన్ని అక్రమ మార్గంలో సేకరించి మిల్లుల్లో ఆడించి తిరిగి ప్రజలకు రూ.50 నుంచి రూ.60 రూపాయలకు అమ్ముతున్నారని ఆరోపించారు. ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే ఈ అక్రమాన్ని అరికట్టాలని డిమాండ్ చేశారు. ప్రజా పంపిణీ వ్యవస్థను సక్రమంగా అమలు చేసి రైతుల నుంచి ధాన్యాన్ని సేకరించడం వల్ల రైతుకు గిట్టుబాటు ధర లభిస్తుందన్నారు. పేదలకు ఆహార భద్రత లభిస్తుందన్నారు. అనంతరం వ్యవసాయ కార్మిక సంఘం సీనియర్ నాయకులు జాలా అంజయ్య తదితరులు మాట్లాడారు. ఈ సమావేశంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నాయకులు కెజి. మస్తాన్, వెల్లంపల్లి ఆంజనేయులు, బడుగు వెంకటేశ్వర్లు, గుమ్మా బాలనాగయ్య, కె.మాల్యాద్రి, ఉబ్బా వెంకటేశ్వర్లు, వై. వీరనారాయణ, అంగలకుర్తి బ్రహ్మయ్య, పట్టపు ప్రకాశం, పారాబతిన శ్రీనివాసులు, కంకణాల వెంకటేశ్వర్లు, అన్నవరపు శేషారావు, బి. జనార్ధన్, టి. ఏడుకొండలు తదితరులు పాల్గొన్నారు.

'మాన్యువల్' కౌన్సిలింగ్ నిర్వహించాలని ధర్నా

మాట్లాడుతున్న యుటిఎఫ్ జిల్లా అధ్యక్షుడు షేక్ అబ్దుల్ హై

ప్రజాశక్తి - ఒంగోలు సిటీ

ఎస్‌జిటిలకు మాన్యువల్ కౌన్సిలింగ్ నిర్వహిస్తామని హామీ ఇచ్చి, నమ్మించి చివరి నిమిషంలో వెబ్ కౌన్సిలింగ్ ప్రకటించడం అత్యంత హేయమైనచర్య అని రాష్ట్ర ఉపాధ్యాయ సంఘాల ఐక్యవేదిక విమర్శించింది.,ఎస్‌జిటి, పిఇటిలకు మాన్యువల్ కౌన్సిలింగ్ నిర్వహించాలని కోరుతూ కలెక్టరేట్ ఎదుట ఉపాధ్యాయులు సోమవారం నిరాహార దీక్షలు చేపట్టారు. యుటిఎఫ్ జిల్లా అధ్యక్షుడు షేక్ అబ్దుల్‌హై అధ్యక్షతన ఎపిటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి డి. శ్రీనివాసులు దీక్షా శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా అబ్దుల్ హై మాట్లాడుతూ విద్యా హక్కుచట్టం, బదిలీ చట్టం పేరుతో ఉపాధ్యాయుల పట్ల ప్రభుత్వం నిరంకుశంగా వ్యవహరిస్తుందని దుయ్యబట్టారు. ఎస్‌జిటిల బదిలీ విషయంలో సంఘ నాయకులకు మాన్యువల్ కౌన్సిలింగ్ నిర్వహిస్తామని హామీ ఇచ్చిన విద్యాశాఖమంత్రి, విద్యాశాఖ కార్యదర్శి,హామీ నిలబెట్టు కోకపోవడం వారి అనైతికతకు నిదర్శనమన్నారు, మంత్రి లోకేష్ మాన్యువల్ కౌన్సిలింగ్ చట్ట విరుద్ధమని ప్రకటించడం హాస్యాస్పదంగా ఉందని విమర్శించారు. ఈ కార్యక్రమంలో ఎపిటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి డి.శ్రీనివాసులు ఎపిటిఎఫ్ 1938 రాష్ట్ర కార్యదర్శి కెజివి.కీర్తి, ఎపిటిఎఫ్ జిల్లా అధ్యక్షుడు వాకా జనార్ధన్ రెడ్డి, ఎస్‌టియు జిల్లా అధ్యక్షుడు కె.ఎర్రయ్య, ఎపిటిఎఫ్1938 జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు బి. వెంకటరావు, ఎన్.లక్ష్మి నారాయణ, పివి.సుబ్బారావు, ఆపస్ జిల్లా అధ్యక్షుడు మల్లికార్జునరావు, దిలీప్ చక్రవర్తి, పిఆర్‌టియు జిల్లా ప్రధాన కార్యదర్శి బి. శ్రీనివాసరావు, బిటిఎ జిల్లా బాధ్యులు కుమారస్వామి, ఎస్‌టియు నెల్లూరు జిల్లా అధ్యక్షుడు అశోక్‌బాబు, యుటిఎఫ్ జిల్లా కోశాధికారి చిన్నస్వామి, మహిళా నాయకురాలు జి.ఉమామహేశ్వరి, ఎస్‌కె.బషీరున్నీషా తదితరులు పాల్గొన్నారు.

కలెక్టర్ నుంచి అవార్డులు అందుకుంటున్న విద్యార్థులు

శ్రీచైతన్య విద్యార్థులకు పురస్కారాలు

ప్రజాశక్తి - చీమకుర్తి

స్థానిక శ్రీచైతన్య టెక్నో స్కూల్ విద్యార్థులకు 2025 ఎస్ఎస్ సి పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించారు. జిల్లా కల్టెకర్ తమీమ్ అన్సారియా చేతుల మీదుగా సోమవారం ప్రతిభా పురస్కారాలు అందుకున్నారు. శ్రీ చైతన్య స్కూల్ విద్యార్థులు తేజో వర్షిత, ఉమారెడ్డి, రిత్విక్ కృష్ణ మనోహర్ ప్రతిభా పురస్కారాలు, ఒకొక్కరూ రూ.20 వేల నగదు అందుకునాా్రు. ఈ కార్యక్రమంలో ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ రావు, సంతనూతలపాడు ఎమ్మెల్యే విజయ్ కుమార్, శ్రీచైతన్య టెక్నో స్కూల్ ఆర్ఐ అనీల్, ప్రిన్సిపల్ నీలిమాదేవి, కోఆర్డినేటర్ జి. శ్రీనివాసరావు, డీన్ అశోక్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

జెండా ఆవిష్కరిస్తున్న నాయకులు

ఎస్‌టియు ఆవిర్భావ దినోత్సవం

ప్రజాశక్తి - ఒంగోలు సిటీ : ఉపాధ్యాయుల సమస్యలపై సుదీర్ఘ పోరాటం చేసిన ఘటన ఎస్‌టియుకే దక్కుతుందని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు కె. ఎర్రయ్య తెలిపారు. ఎస్‌టియు 78వ ఆవిర్భావ దినోత్సవం ఉద్యమ పతాకాన్ని సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎర్రయ్య మాట్లాడుతూ 1947 జూన్9న నిజాం ప్రభుత్వ కాలంలో ప్రముఖ తెలంగాణ కవి మగ్దమ్ మహాయుద్దీన్ నాయకత్వంలో ఆవిర్భవించిన ఎస్‌టియుకు అనేక పోరాటాలు చేసిన ఘనత ఉందన్నారు. అప్రెంటీస్ విధానాన్ని వ్యతిరేకిస్తూ 70 రోజులు పాటు నిరాహార దీక్షలు చేసిన చరిత్ర ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్‌టియు నెల్లూరు జిల్లా అధ్యక్షుడు అశోక్ బాబు, మాజీ ఉపాధ్యక్షుడు సిహెచ్. ఆదినారాయణ, రాష్ట్ర కౌన్సిలర్ కడియాల ప్రసాద్, పాధ్యాయ వాణి కన్వీనర్ పి.రత్తయ్య, ఒంగోలు పట్టణ అధ్యక్షుడు మాధవరావు కొనకనమిట్ల మండల అధ్యక్షుడు అల్లడి బాబూరావు, చంద్రశేఖర్, జిల్లా కార్యదర్శి మధుసూదన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

సిఎం వీడియో కాన్ఫరెన్స్‌లో మండల అధికారులు

విజన్ 2047 కార్యాలయం ప్రారంభం

ప్రజాశక్తి - అద్దంకి

స్థానిక మండల ప్రజా పరిషత్ అభివృద్ధి కార్యాలయంలో విజన్ 2047లో భాగంగా నియోజకవర్గ విజన్ కార్యాచరణ ప్రణాళిక అద్దంకి యూనిట్ కార్యాలయం సోమవారం ఎంపిడిఒ కార్యాలయంలో ప్రారంభించారు. రాష్ట్రంలో 175 యూనిట్లు, 26 జిల్లా కార్యాలయాలను వర్చువల్‌గా సిఎం చంద్రబాబు వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడారు. కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి బాలమ్మ, ఎంపిడిఒ బి సింగయ్య పాల్గొన్నారు.

పి4 ఎంపికపై సమావేశం

ప్రజాశక్తి - యద్దనపూడి

మండల కేంద్రమైన యద్దనపూడి సచివాలయం నందు సర్పంచ్ వల్లేరు రేణుక బాలకోటేశ్వరరావు అధ్యక్షతన పి4పై సోమవారం సమావేశం నిర్వహించారు. సమావేశంలో తహశీల్దారు రవికుమార్ మాట్లాడుతూ పి4పై సర్వే చేసిన సిబ్బంది గ్రామంలో 126 కుటుంబాలను గుర్తించారని తెలిపారు. కార్యక్రమంలో కార్యదర్శి కె శ్రీను, గ్రామ పెద్దలు కనపర్తి నాగేశ్వరరావు పాల్గొన్నారు.

పొగాకు బేళ్ల అమ్మకం

ప్రజాశక్తి-కొండపి

కొండపి పొగాకు వేలం కేంద్రంలో సోమవారం కిలో పొగాకు కనిష్ట ధర రూ. 180 పలికినట్లు వేలం నిర్వహణ అధికారి జి.సునీల్ కుమార్ తెలిపారు. క్లస్టర్ పరిధిలోని చోడవరం, చిన్నవెంకన్నపాలెం, ముప్పవరంకు చెందిన రైతులు 702 పొగాకు బేళ్లను అమ్మకానికి తెచ్చారు. అందులో 577 బేళ్లు అమ్ముడు పోయాయి. వివిధ కారణాలతో 125 బేళ్లను తిరస్కరించారు. కిలో పొగాకు గరిష్ట ధర రూ.280, సరా సరి ధర రూ. 251.52 పైసలు పలికింది. వేలంలో 18 కంపెనీల ప్రతినిధులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంతో లాభాలు

ప్రజాశక్తి-కొండపి

ప్రకృతి వ్యవసాయం ద్వారా సాగుచేసిన పంటలకు మంచి డిమాండ్ ఉందని, వాటి ద్వారా అధిక లాభాలు పొందవచ్చునని యూనిట్ ఇన్‌ఛార్జులు రంజిత్, మాధవ తెలిపారు. ప్రకతి వ్యవసాయం ద్వారా పండించిన పంటలను సోమవారం విక్రయించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రకతి వ్యవసాయ పద్ధతిలో పండించిన పంటలకు ప్రస్తుతం మార్కెట్‌లో మంచి డిమాండ్ ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఐసిఆర్‌పిలు జోత్స్న, గౌతమి, విజయలక్ష్మి, ఏడుకొండలు, తిరుమల ప్రకతి వ్యవసాయ సిబ్బంది, మహిళలు, రైతులు పాల్గొన్నారు.

రైతులకు విత్తనాలు అందజేయాలి

ప్రజాశక్తి-కొండపి

రైతులకు 90 శాతం సబ్సిడీపై నాణ్యమైన విత్తనాలు అందించాలని రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కె వీరారెడ్డి డిమాండ్ చేశారు. రైతులకు నాణ్యమైన విత్తనాలు అందజేయాలని కోరుతూ స్థానిక తహశీల్దారు కార్యాలయం సోమవారం ధర్నా నిర్వహించారు. అనంతరం తహశీల్దారు మురళిని కలిసి వినతి పత్రం అందజేశారు. కౌలు రైతులకు గుర్తింపు కార్డులు ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో ఆర్.లక్ష్మీసాయి, బ్రహ్మయ్య, రోశయ్య, నాగభూషణం, రామయ్య తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరాకు అంతరాయం

ప్రజాశక్తి - కొల్లూరు

రావికంపాడు వచ్చే 11కెవి మరమ్మతుల కారణంగా మంగళవారం 10 నుండి 12 గంటల వరకు విద్యుత్తుకు అంతరాయం కలుగుతుందని ఎఇ సుధాకర్ బాబు తెలిపారు. బొద్దులూరుపాడు, గొల్లపాలెం, క్రాప, రావికింపాడు, తాడిగరపాడు, కొల్లూరులోని గాంధీనగర్, బోస్‌నగర్, కెటి కాలనీ, వేమూరులోని అబ్బన గూడవల్లి, వెల్లబాడు, బలిజేపల్లికి ఉదయం 8 నుండి 2గంటల వరకు విద్యుత్తుకు అంతరాయం కలుగుతుందని తెలిపారు.

వేమూరు మార్కెట్ కమిటీ చైర్మన్‌గా పూర్ణకుమారి

ఎంఎంసి సభ్యులతో ప్రమాణ స్వీకారం చేయిస్తున్న ఆనందబాబు

ప్రజాశక్తి - వేమూరు

వ్యవసాయ మార్కెట్ యార్డు కమిటీ నూతన చైర్మన్‌గా అమర్తలూరుకు చెందిన మాజీ ఎంపీపీ, టిడిపి నాయకులు గొట్టిపాటి జయవెంకట పూర్ణ కుమారి, భాను గంగాధర్ ఆదివారం రాత్రి ప్రమాణ స్వీకారం చేశారు. శాసన సభ్యులు నక్క ఆనంద బాబు ఎఎంసి గౌరవ అధ్యక్షులుగా 13 మంది డైరెక్టర్లు ప్రమాణ స్వీకారం చేశారు. జిల్లా ఇన్చార్జి మంత్రి కొలుసు పార్థసారథి, వేమూరు, చీరాల శాసన సభ్యులు నక్కా ఆనందబాబు, మద్దులూరి మాలకొండయ్య పాల్గొని చైర్మన్, వైస్ చైర్మన్, సభ్యులతో ప్రమాణ స్వీకారం చేయించారు. చైర్మన్‌గా పూర్ణ కుమారి గంగాధర్, వైస్ చైర్మన్ అమ్మిశెట్టి కిషోర్, సభ్యులు అల్లా కోటిరెడ్డి, భూపతి వెంకటేశ్వరరావు, గంటా రమాదేవి, మొవ్వ శ్రీనివాసరావు, రాజులపాటి వెంకటేశ్వరరావు, సనకా నాగమణి, షేక్ జమీల, వట్టిప్రోలు సునీత, ఎర్రంశెట్టి సత్యనారాయణ, యాసం భార్గవి, గట్టు రమాలక్ష్మి, కందుకూరి వెంకటేశ్వరరావు, పోతారులంక కుటుంబరావుచే ప్రమాణ స్వీకారం చేయించారు. అమర్తలూరు నుండి వేముల వరకు కూటమి నాయకులు పెద్ద ఎత్తున ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి కొలుసు పార్థసారథి, శాసన సభ్యులు ఆనంద బాబు, కొండయ్య మాట్లాడుతూ గత ప్రభుత్వ పాలనలో మార్కెట్ యార్డుకు కమిటీలు ఉన్నప్పటికీ రైతులకు ఏమాత్రం ఉపయోగపడలేదని అన్నారు. కూటమి ప్రభుత్వ పాలనలో ఎఎంసి ద్వారా రైతులకు అవసరమైన అన్ని సౌకర్యాలు ఏర్పాటు చేసి రైతు ప్రయోజనాల కోసం ప్రత్యేక దృష్టి సారిస్తామని అన్నారు. కార్యక్రమంలో నాయకులు జొన్నలగడ్డ విజయబాబు, తూనుగుంట్ల సాయిబాబా, మైనేని మురళీకృష్ణ, కనగాల మధుసూదన ప్రసాద్ పాల్గొన్నారు.

యోగాంధ్రపై అవగాహన ర్యాలీ

యద్దనపూడిలో యోగా అవగాహన ర్యాలీ

ప్రజాశక్తి - పంగులూరు

ఈనెల 21న అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా యోగాంధ్ర ర్యాలీ సోమవారం మండలంలో నిర్వహించారు. ఈ ర్యాలీ ఎంపిడిఒ కార్యాలయం నుండి మసీదు మీదుగా బస్టాండ్ వరకు జరిగింది. బస్టాండ్ సెంటర్లో మానవహారం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఎంపిడిఒ కె స్వరూపరాణి, తహశీల్దారు పి సింగారావు, ఆయుష్ మెడికల్ ఆఫీసర్ పిఎస్ఆర్‌విఎస్ కృష్ణకుమార్, డిప్యూటీ ఎంపిడిఒ కె సుమంత్, ఎంఇఒ జి వీరాంజనేయులు, హౌసింగ్ ఏఈ కిషోర్ కుమార్, ఎపిఒ కె సంతోషం, పంగులూరు పంచాయతీ కార్యదర్శి బి రాంబాబు, సచివాలయాలు, వివిధ ప్రభుత్వ కార్యాలయాల సిబ్బంది పాల్గొన్నారు.

పర్చూరు : యోగాంధ్ర 2025లో భాగంగా సచివాలయాల పరిధిలో సోమవారం యోగపై అవగాహన ర్యాలీలు నిర్వహించారు. సచివాలయ సిబ్బంది, కార్యదర్శులు, ప్రజలు ర్యాలీలో పాల్గొన్నారు. రమణాయపాలెం సచివాలయం పరిధిలో యోగాంధ్ర అవగాహన ర్యాలీ నిర్వహించారు. ర్యాలీలో సర్పంచ్ కారుమూడి శ్రీనివాసరెడ్డి, ఎంపీటీసీ అడపా వెంకటరెడ్డి, ఉపసర్పంచ్ తానిపర్తి సీతారామిరెడ్డి, వార్డు సభ్యులు, పంచాయతీ కార్యదర్శి బి హరిప్రసాద్ పాల్గొన్నారు. మండలంలో 20 సచివాలయాల పరిధిలో యోగాపై అవగాహన ర్యాలీలు సోమవారం నిర్వహించారు. ఉప్పుటూరి హెూమియో డాక్టర్ దాసరి చంద్రశేఖర్ మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాల మేరకు యోగ అవగాహన ర్యాలీలు నిర్వహించినట్లు చెప్పారు. ఈ నెల 21న జరిగే అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని జయప్రదం చేయాలని కోరారు.

యద్దనపూడి : 11వ అంతర్జాతీయ యోగా మాసోత్సవాల సందర్భంగా యద్దనపూడిలో సోమవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా తహశీల్దారు రవికుమార్ మాట్లాడుతూ యోగా అంటే శ్వాసపై ధ్యాస అన్నారు. కార్యక్రమంలో సర్పంచి వలేరు రేణుక బాలకోటేశ్వరరవు, పంచాయతీ కార్యదర్శి కె శ్రీను, సచివాలయ సిబ్బంది కిషోర్, అంగన్వాడి కార్యకర్తలు విజయ, నాయకులు కనపర్తి నాగేశ్వరరావు, సుబ్బారావు, శ్రీను పాల్గొన్నారు.

ముండ్లమూరు : మండల కేంద్రంలో యోగాంధ్రపై మండల స్థాయి అధికారులు అవగాహన ర్యాలీ సోమవారం నిర్వహించారు. కార్యక్రమంలో తహశీల్దారు ఎల్ లక్ష్మీనారాయణ, ఎంపిడిఒ పి సునీత, ఎస్ఐ కె కమలాకర్, ఎపిఒ వెంకట్రావు, ఎపిఎం హనుమంతరావు, వైద్య అధికారులు జె వెంకటేశ్వరరెడ్డి, ఎం జాస్మిన్, ఎఎస్ఐ, హెల్త్ సూపర్వైజర్ పాల్గొన్నారు.

వామ్మో.. ఇవేం ఎండలు బాబోయ్..

తీవ్ర ఎండలో తలపై కొంగులతో మహిళలు

ప్రజాశక్తి - చీరాల

భానుడి భగభగలకు ప్రజలు బెంబేలెత్తిపోయారు. ప్రజలపై భానుడు తన ప్రతాపం చూపిస్తున్నాడు. ఇటీవల కాస్త వర్షం కురిసి ప్రజలు సేద తీరారు. అనుకునే లోపు ఎండా కాలం కావటంతో ఉష్ణోగ్రతలు అధికంగా పెరుగుతున్నాయి. అయితే గత నాలుగు రోజులుగా ఉదయం 9 గంటల నుండే బానుడు తన ఉగ్రరూపాన్ని చూపుతున్నాడు. గరిష్ట ఉష్ణోగ్రత 40 డిగ్రీలు నమోదై 47 డిగ్రీలను తలపించింగా కనిష్ట ఉష్ణోగ్రత 33 డిగ్రీలుగా నమోదైంది. దింతో మధ్యాహ్నం 12 గంటలు దాటితే ఇళ్ల నుంచి బయటకు రాలేని పరిస్థితి కనిపించింది. గత వారం రోజులుగా లేని ఉష్ణోగ్రతలు గణనీయంగా పెరుగుదల కనిపించడం ఆందోళన కలిగిస్తోంది. ఉష్ణోగ్రతలు ఒక్కసారిగా అధికంగా పెరగడంతో పట్టణ ప్రజలు మధ్యాహ్నానికే ఇళ్లకు పరుగులు తీశారు. ప్రతరోజు వివిధ ప్రాంతాల నుండి హాస్పిటల్స్, వస్త్ర, ఇతర వ్యాపారాలకు ప్రజలు పట్టణానికి చేరుకుంటారు. అయితే సోమవారం ఎండ తీవ్రత అధికంగా ఉండటంతో నిత్యం ప్రజలతో రద్దీగా ఉండే వ్యాపార రహదారులన్ని నిర్మానుషంగా మారాయి. నిత్యం రద్దీగా ఉండే కారంచేడు గేటు సెంటర్, పేరాల చిన్నరథం సెంటర్, మసీద్ సెంటర్, మహాత్మా గాంధీ క్లాత్ మార్కెట్ రోడ్డు, రైల్వే స్టేషన్ రోడ్డు, ముంత వారి సెంటర్ రహదారులన్ని ఎండ తీవ్రతకు నిర్మానుషంగా మారాయి. ఎండలు తీవ్ర రూపం దాలుస్తూ ఉండడంతో పిల్లలను పాఠశాలకు ఎలా పంపించాలో అర్థం కాక తల్లి, దండ్రులు ఆందోళన చెందుతున్నారు. ఎండలు సెగలు కొడుతుండటంతో అటు పసిబిడ్డ తల్లులు, వృద్ధులు ఆందోళన చెందతున్నారు. ఇవేం ఎండలు రా బాబు అంటూ ప్రజలు అనుకుంటున్నారు. అత్యవసర పరిస్థితుల మినహా ప్రజలు రోడ్లపైకి రావాలంటే భయ భ్రాంతులకు గురవుతున్నారు. గొడుగు సాయంతో బయటకు వస్తున్న పరిస్థితులు కనిపిస్తున్నాయి. జాగ్రత్తలు పాటించాలని వైద్యులు చెబుతున్నారు.

భార్యపై అనుమానంతో పెట్రోల్ పోసి నిప్పటించిన భర్త

ప్రజాశక్తి - బాపట్ల

భార్యపై అనుమానంతో భర్త పెట్రోల్ పోసి నిప్పంటించిన సంఘటన మండలంలోని చెరువు జమ్ములపాలెంలో సోమవారం జరిగింది. బాపట్ల ఏరియా వైద్యశాల ఔట్ పోస్ట్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం చెరువు జమ్ములపాలెంకు చెందిన దాసరి హరీష్‌తో సుభాషిణి (25)కి పదేళ్ల క్రితం వివాహమైంది. వారికి ఇద్దరు కుమారులు ఉన్నారు. భార్యపై అనుమానంతో తరచూ గొడవలు పడుతున్న నేపథ్యంలో ఆమెపై పెట్రోల్ పోసి నిప్పటించాడు. 80శాతం శరీరం కాలిన గాయాలతో ఉన్న క్షతగాత్రురాలిని వైద్యం కోసం వైద్యశాలకు తరలించారు. కాలిన గాయాలతో ఆమె పరిస్థితి మరింత విషమించడంతో మెరుగైన వైద్యం కోసం గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు తెలిపారు. సుభాషిణి తల్లి, దండ్రుల ఫిర్యాదు మేరకు రూరల్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వాహన పత్రాలు లేకుంటే జరిమానా

ప్రజాశక్తి - కొల్లూరు

సరైన పత్రాలు లేని ట్రాక్టర్లకు జరిమానా విధించినట్లు ఎన్ఫోర్స్‌మెంట్ ఇన్స్‌పెక్టర్ అంకమ్మరావు తెలిపారు. సోమవారం ఆయన వాహనాలు తనిఖీ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ సరైన పత్రాలు, ఫిట్నెస్ లేకుండా వాహనాలు నడపరాదని అన్నారు. మైనర్ల చేత వాహనాలు నడిపిస్తే వారి తల్లిదండ్రులపై చర్యలు తీసుకుంటామని అన్నారు. ఆటోలో పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించరాదని అన్నారు. ఇసుక ట్రాక్టర్లు, లారీలపై టార్పాలిన్ పట్టలు కప్పాలని సూచించారు. వాహనాలు నడిపే వారికి తప్పనిసరిగా లైసెన్స్ ఉండాలని అన్నారు. లైసెన్స్ లేకుండా వాహనాలు నడిపితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

స్మశాన వాటిక రహదారి పరిశీలిస్తున్న అశోక్ బాబు

దళిత స్మశాన వాటిక రోడ్డు పరిశీలన

ప్రజాశక్తి - వేమూరు

చుండూరు మండలంలోని మోదుకూరుకు చెందిన దళిత వాడ ప్రజలు స్మశాన వాటికకు వెళ్లే రహదారి సక్రమంగా లేక ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని వైసీపీ ఇన్‌ఛార్జి వరకూటి అశోక్ బాబు సోమవారం పరిశీలించారు. సమస్యను ప్రభుత్వ అధికారుల దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారం అయ్యే విధంగా చూస్తానని బరోసా ఇచ్చారు. అనంతరం గ్రామానికి చెందిన సీనియర్ నాయకులు చింతబతుని కోటేశ్వరరావును పరామర్శించారు. ఆయన వెంట వైసిపి మండల నాయకులు ఉన్నారు.

విద్యార్థులను అభినందిస్తున్న కలెక్టర్ జెవి మురళి

యోగాసనంలో సత్తా చాటిన విద్యార్థులు

ప్రజాశక్తి - పంగులూరు

బాపట్లలో యోగాంధ్ర కార్యక్రమాల్లో భాగంగా జిల్లా స్థాయిలో సోమవారం నిర్వహించిన యోగ పోటీల్లో మండలంలోని చందలూరు జెడ్‌పి ఉన్నత పాఠశాల విద్యార్థులు సత్తా చాటారు. 11వ అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా యోగాసన, సూర్య నమస్కారం, ప్రణాయామం, ధ్యానం పోటీలు నిర్వహించారు. 10 నుండి 18 ఏళ్లు ఉన్న వారికి నిర్వహించిన పోటీల్లో బాలికల విభాగంలో న్యాయపాము శృతి, ఎన్ భవ్యశ్రీ, బాలుర విభాగంలో మద్దిశెట్టి వెంకటేష్ రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ప్రణాయామం పోటీలో నాయపాము ప్రీతి, ధ్యానంలో నాయపాము హాసిని రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. త్వరలో విశాఖపట్నంలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో విద్యార్థులు పాల్గొంటారని పాఠశాల పీఇటి ప్రతిమ తెలుపారు. యోగాసనాల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థినీ విద్యార్థులను కలెక్టర్ వెంకట మురళి అభినందించారు.

అంగన్‌వాడి కేంద్రంలో అక్షరాభ్యాసం చేస్తున్న సిడిపిఓ

అంగన్‌వాడీ సేవలు సద్వినియోగం చేసుకోండి

ప్రజాశక్తి - సంతమాగులూరు

అంగన్వాడి కేంద్రాల్లో కార్యకర్తలు అమ్మ ప్రేమను చూపిస్తూ చిన్నారులకు పౌష్టికాహారంతో పాటు, విద్యా బుద్ధులు, క్రమశిక్షణ, మంచి అలవాట్లు నేర్పిస్తున్నారని సిడిపిఓ డి సుధ తెలిపారు. మండలంలోని వెల్లలచెరువులో అంగన్వాడి పిలుస్తోంది కార్యక్రమం సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా అంగన్వాడి కార్యకర్త తులసి ఆధ్వర్యంలో గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఇంటింటికి తిరిగి ప్రచారం చేశారు. అంగన్వాడి కేంద్రంలో పిల్లలకు అక్షరాభ్యాసం చేశారు. కార్యక్రమంలో గ్రామ నాయకులు చింతా రామారావు, సూపర్ వైజర్ సుష్మారాణి, అంగన్వాడి టీచర్లు పాల్గొన్నారు.

వినతి పత్రం అందజేస్తున్న ఎఐటియుసి నాయకులు

కార్మికులను విధుల్లోకి తీసుకోవాలి

ప్రజాశక్తి - సంతమాగులూరు

శాఖ ఉక్కు ఉద్యమంలో పాల్గొన్నారని విధుల నుంచి తొలగించ బడిన కార్మికులను యాజమాన్యం వెంటనే విధులలోకి తీసుకోవాలని ఎఐటియుసి ఆధ్వర్యంలో తహశీల్దారు కె రవిబాబుకు సోమవారం వినతి పత్రం అందజేశారు. విధుల నుండి తొలగించిన 2500 మంది కార్మికులను విధుల్లోకి తీసుకోవాలని, విశాఖ ఉక్కు పరిశ్రమను ప్రైవేటు పరం చేయరాదని, ఉక్కు పరిశ్రమ యాజమాన్యం కార్మిక నాయకులపై చేపట్టిన కక్షపూరిత చర్యలు ఉపసంహరించుకోవాలని, ఉక్కులో ప్రభుత్వమే పెట్టుబడులు పెట్టాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎఐటియుసి నాయకులు ముస్తఫా, ఎస్‌కె ఖాదర్ భాషా, మేకల రమణయ్య, గుర్రం కొండలు, కోటేశ్వరరావు పాల్గొన్నారు.

అర్జీలు స్వీకరిస్తున్న తహశీల్దారు గోపికృష్ణ

అర్జీలు పరిశీలించి పరిష్కరించాలి

ప్రజాశక్తి - చీరాల

ప్రజా సమస్యలపై వచ్చిన ప్రతి అర్జీని క్షేత్రస్థాయిలో పరిశీలించి ఆయా శాఖల అధికారులు సత్వరమే పరిష్కరించాలని తహశీల్దారు గోపికృష్ణ అన్నారు. స్థానిక తహశీల్దారు కార్యాలయంలో సోమవారం జరిగిన ప్రజా పిర్యాదుల వేదికలో వివిధ సమస్యలపై అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా సమస్యలు పరిష్కరించేందుకే పిజిఆర్ఎస్ కార్యక్రమాన్ని ప్రభుత్వం నిర్వహిస్తుందని అన్నారు. భూమి సమస్యలు, గ్రామ ఉమ్మడి అవసరాలు, ప్రభుత్వ అధికారుల ద్వారా పరిష్కారం కావాల్సిన వ్యక్తిగత సమస్యలపై వచ్చే అర్జీలను ఆయా శాఖల సిబ్బంది పరిశీలించి పరిష్కరిస్తారని తెలిపారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. పిజిఆర్ఎస్‌కు వచ్చిన ప్రతి అర్జిని ఆయా శాఖల అధికారులు పరిశీలించి సమస్య పరిష్కారిస్తారని అన్నారు. కార్యక్రమం హౌసింగ్ ఎఈ సుబ్బారావు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు అవార్డులు

ప్రతిభా అవార్డు అందుకుంటున్న ఎండ్లూరి సుమనశ్రీ

అవార్డు అందుకుంటున్న రేపల్లె విద్యార్థిని ఉషశ్రీ

ప్రజాశక్తి - పంగులూరు

గత మార్చిలో జరిగిన 10వ తరగతి పరీక్షా ఫలితాల్లో మండలంలో అత్యధిక మార్కులు సాధించిన ఐదుగురు విద్యార్థులకు సోమవారం బాపట్లలో జరిగిన ప్రతిభా పురస్కార అవార్డుల ప్రధానోత్సవంలో అవార్డులు అందజేశారు. మండలంలోని చందలూరు జెడ్‌పి ఉన్నత పాఠశాలకు చెందిన కట్టా హారిక, జిర్రా మణిదీప్‌రెడ్డి, కొండ మంజులూరు జెడ్‌పి ఉన్నత పాఠశాలకు చెందిన ఎండ్లూరి సుమనశ్రీ, బూదవాడ జెడ్‌పి ఉన్నత పాఠశాల చెందిన భవనం దివ్య, జి మురళీకృష్ణ సాయిరాం ప్రభుత్వ ప్రతిభా అవార్డులకు ఎంపికయ్యారు. కలెక్టరేట్లో ఒక్కొక్కరికి రూ.20 వేల నగదు తోపాటు ప్రతిభా అవార్డులు అందజేశారు. కార్యక్రమంలో బాపట్ల, చీరాల ఎమ్మెల్యేలు వేగేశన నరేంద్రవర్మ, ఎంఎం కొండయ్య, విద్యాశాఖ అధికారులు అవార్డులను అందజేశారు. అవార్డులు అందుకున్న విద్యార్థులను ఉపాధ్యాయులు, గ్రామస్తులు, తల్లి, దండ్రులు అభినందించారు.

చుండూరు : మండలంలోని ఎడ్లపల్లి గ్రామంలోని శ్రీ ఆలపాటి వెంకట్రామయ్య జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్లస్ వన్ విద్యార్థినిలు చేబ్రోలు దీపిక, ఎందేటి నిర్మల జ్యోతి ప్రతిభ అవార్డులు సోమవారం బాపట్ల కలెక్టర్ కార్యాలయంలో అందుకున్నారు. రాష్ట్ర ప్రభుత్వం 10వ తరగతి, ఇంటర్మీడియట్‌లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు షైనింగ్ స్టార్ పేరుతో ప్రతిభా పురస్కారాలు అందిస్తుంది. ఎడ్లపల్లి పాఠశాల్లో ఇంటర్మీడియట్ చదివిన చేబ్రోలు దీపిక 931 మార్కులు, ఎందేటి నిర్మల జ్యోతి సిఇసిలో 889 మార్కులు సాధించి అవార్డులు అందుకున్నారు. పురస్కారాలు అందుకున్న విద్యార్థులను హెచ్‌ఎం కుర్రా శ్రీనివాసరావు అభినందించారు. విద్యార్థులు దీపిక, నిర్మల జ్యోతి, అధ్యాపక బృందానికి విద్యా కమిటీ చైర్మన్ భయ్యా సతీష్, విద్యా కమిటీ కో అప్టేట్ రావి సాయిబాబు, అలపర్తి శ్రీనివాసరావు అభినందనలు తెలిపారు.

రేపల్లె : 10వ తరగతి పరీక్ష ఫలితాల్లో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులకు రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన ప్రతిభ అవార్డుల ప్రధానోత్సవంలో కలెక్టర్ వెంకట మురళి, బాపట్ల ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ చేతుల మీదుగా తమ విద్యార్థి తుపాకుల ఉషశ్రీ ప్రతిభా పురస్కార పత్రం, రూ.20వేల నగదు బహుమతి, మెడల్ అందుకున్నట్లు పాఠశాల ప్రిన్సిపల్ బ్రదర్ కిరణ్ కుమార్, వైస్ ప్రిన్సిపల్ ప్రదీప్‌రెడ్డి, ఉపాధ్యాయులు తెలిపారు. విద్యార్థిని ఉషశ్రీ మాటాడుతూ కలెక్టర్ జెవి మురళి చేతుల మీదుగా అవార్డు అందుకోవడం ఆనందంగా ఉందని తెలిపారు.

ఇంకొల్లు : 10వ తరగతి ఫలితాల్లో మండల ప్రథమ స్థానంలో నిలిచిన ఆదర్శ హైస్కూలు విద్యార్థిని షేక్ షబానా రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన షైనింగ్ స్టార్ అవార్డును కలెక్టర్ కార్యాలయంలో ఎమ్మెల్యే వేగేశన నరేంద్ర వర్మ చేతుల మీదుగా సోమవారం అందుకున్నారు. భవిష్యత్తులో మంచి మార్కులు సాధించి అగ్రగామిగా నిలవాలని సూచించారు. రు.20వేల చెక్కు, మెడల్‌తో పాటు ప్రశంసాపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ తోటకూర విజయభాస్కర్, తల్లి, దండ్రులు షేక్ జానిబాషా, జరినాను వేగేశన నరేంద్రవర్మ అభినందించారు.

మార్టూరు రూరల్ : 10వ తరగతి ఫలితాల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన శ్రీ చైతన్య విద్యార్థులకు షైనింగ్ స్టార్ పేరుతో ప్రతిభా పురస్కారాలను బాపట్ల కలెక్టర్ వెంకట మురళి, బాపట్ల, చీరాల ఎంఎల్‌ఎలు వేగేశన నరేంద్రవర్మ, మద్దులూరి మాలకొండయ్య, డీఈఒ పురుషోత్తం చేతుల మీదుగా అందజేశారు. విద్యార్థులు కె సుమిత్ర, కె వాసవి, కె కీర్తన, బి ఆశ్రిత, బి నందిని అందుకున్నారు. ప్రతి విద్యార్థికి రూ.20వేల చెక్, ప్రశంసా పత్రం, మెడల్ అందజేశారు. పురస్కారాలు అందుకున్న విద్యార్థులను పాఠశాల ప్రిన్సిపాల్ కె సంపత్ కుమార్, సిబ్బంది అభినందించారు.

అవార్డులు అందుకుంటున్న ఎడ్లపల్లి విద్యార్థులు

అవార్డు అందుకుంటున్న మార్టూరు విద్యార్థులు

ఉత్తమ సమాజ నిర్మాణమే మానవత సంస్థ లక్ష్యం

ప్రజాశక్తి - బాపట్ల

ఉత్తమ సమాజ నిర్మాణానికి మానవతా స్వచ్ఛంద సంస్థ ముందుకు వచ్చిందని సంస్థ వ్యవస్థాపకులు ఎన్ రామచంద్రారెడ్డి అన్నారు. పట్టణంలో చీల్ రోడ్డు సెంటర్లోని ఎకోహౌస్‌లో సోమవారం జరిగిన మానవత స్వచ్ఛంద సేవా సంస్థ బాపట్ల విభాగం నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకరోత్సవ సభలో ఆయన మాట్లాడారు. డాక్టర్ శరత్ బోస్ అధ్యక్షతన జరిగిన సభలో ఆయన మాట్లాడుతూ సేవా భావంతో అందరూ ముందుకు వెళ్లాలని అన్నారు. మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ ద్వారా అనేక సేవా కార్యక్రమాలు చేపట్టి సమాజ హితానికి పాటుపడాలనే సంకల్పంతో ప్రతి ఒక్కరు ముందు కెళ్లాలని అన్నారు. కార్యక్రమంలో మానవతా సంస్థ డైరెక్టర్ ఎ రామంజులరెడ్డి, గుంటూరు శాఖ బాధ్యులు పావులూరి రమేష్, ఉప్పాల సాంబశివరావు, బాపట్ల మానవతా సంస్థ అధ్యక్షులు ప్రొఫెసర్ సత్యనారాయణ, ఉపాధ్యక్షులు సుబ్బారావు, కార్యదర్శి ప్రసన్నాంజనేయులు, కోశాధికారి చెన్నంశెట్టి కేశవులు, మహిళా సభ్యులు పద్మజ, అనంత కుమారి పాల్గొన్నారు.

మాట్లాడుతున్న రామచంద్రారెడ్డి

మానవతా సంస్థ నూతన కార్యవర్గం

సంస్థ నూతన అధ్యక్షులు ప్రొఫెసర్ హరిప్రసాద్, ఉపాధ్యక్షులు రవికుమార్, కార్యదర్శి గురజాల శ్రీనివాసరావు, సహాయ కార్యదర్శి మోదడుగు సూరిబాబు, కోశాధికారి చెన్నంశెట్టి కేశవులు, మహిళా కార్యదర్శి మంజులత, కన్వీనర్ శ్రీలక్ష్మి, సంయుక్త కార్యదర్శి శ్రీదేవి, కమిటీ సెక్రటరీ జి మోహన్‌గౌడ్, కన్వీనర్ వై వెంకటనారాయణ, గవర్నర్ బాడీ చైర్మన్ టి రామాంజనేయులు, డైరెక్టర్లు వి హరిబాబు, సిహెచ్ సత్యనారాయణ, కోట సుబ్బారావు ఎన్నికయ్యారు.

పాఠశాలలకు సన్న బియ్యం పంపిణీ

ఎంఇఒ2 జి వీరాంజనేయులు

ప్రజాశక్తి - పంగులూరు

ఎంఇఒ జి వీరాంజనేయులు

మండలంలోని ప్రభుత్వ పాఠశాలలు అన్నిటికీ సన్న బియ్యం పంపిణీ చేసినట్లు ఎంఇఒ2 జి వీరాంజనేయులు సోమవారం తెలిపారు. మధ్యాహ్న భోజనం విద్యార్థులకు రుచికరంగా ఉండే విధంగా ఇక నుండి సన్న బియ్యంతోనే భోజనం వండి పెడతారని చెప్పారు. ఇప్పటి వరకు పాఠశాలలకు సన్న బియ్యం రాలేదని, ఇక నుండి సన్నబియ్యం పంపిణీ జరుగుతుందని చెప్పారు. ఉన్నత, ప్రాథమికోన్నత, ప్రాథమిక, ఆదర్శ, ప్రత్యేక పాఠశాలన్నీ కలిపి 44 ఉన్నాయని తెలిపారు. ఆయా పాఠశాలలన్నింటికీ కలిపి 62.25 క్వింటాళ్ల సన్న బియ్యం పంపించామని తెలిపారు. వీటితో పాటు 153 కేజీల రాగి పిండి, బెల్లం కూడా పంపినట్లు తెలిపారు. ఈ విద్యా సంవత్సరం సంబం ధించి నోట్ బుక్స్, పాఠ్య పుస్తకాలు, డిక్షనరీలు, బ్యాగులు, యూనిఫామ్, షఉలు మొత్తం 9 రకాల వస్తువులు ఆయా పాఠశాలలకు పంపిణీ చేసినట్లు తెలిపారు.

విరాళం అందజేస్తున్న దాతలు

మండప నిర్మాణానికి విరాళం

ప్రజాశక్తి - అద్దంకి

సింగరకొండ శ్రీ ప్రసన్నాంజనేయ స్వామి రాతి ముఖ మండప నిర్మాణానికి జనకవరం గ్రామానికి చెందిన తలపనేని సతీష్ బాబు, ఆయన కుమార్తె కైవల్య రూ.1,0,1116, హైదరాబాద్‌కు చెందిన ఈరంకి సూర్యనారాయణ, ఉషారాణి దంపతులు రూ.100,116 విరాళాన్ని దేవస్థానం సీనియర్ అసిస్టెంట్ మదు మోహన్‌కు చెక్కు రూపంలో సోమవారం అందించారు. కార్యక్రమంలో దేవస్థానం అర్చకులు మూర్తి, తదితరులు పాల్గొన్నారు.

రామస్తూప నిర్మాణానికి విరాళం అందిస్తున్న దృశ్యం

రామస్తూపం నిర్మాణానికి విరాళం

ప్రజాశక్తి - అద్దంకి

రోటరీ సెక్రెటరీ చుండూరి మురళీ సుధాకరరావు వివాహ వార్షికోత్సవం సందర్భంగా సింగర కొండలో శ్రీ రమ్యం ఫౌండేషన్ నిర్మిస్తున్న శ్రీరామనామ స్తూప నిర్మాణ నిమిత్తం రూ.25 వేల నగదు విరాళంను ఫౌండేషన్ అధ్యక్షులు స్వర్ణ వెంకట సుబ్బారావుకు సోమవారం అందచేశారు. కార్యక్రమంలో రోటరీ అధ్యక్షులు చప్పిడి వీరయ్య, మలాది శ్రీనివాసరావు, షేక్ మహమ్మద్ రఫీ, బాచిన పూర్ణ చంద్రరావు, సందిరెడ్డి శ్రీనివాసరావు, సంకా సుబ్రహ్మణ్యం, పువ్వాడ రామ కోటేశ్వరావు, అద్దంకి లేవి ప్రసాద్, జాగర్లమూడి శివకుమారి, అలహరి హరిప్రసాద్, అన్నంగి సుబ్బారావు, షేక్ అంజాద్ భాషా, తమ్మన శ్రీనివాసరావు, బాచిన స్నేహలత పాల్గొన్నారు.

నేడు మండల సమావేశం

ప్రజాశక్తి - చెరుకుపల్లి

మండల పరిషత్ సాధారణ సర్వసభ్య సమావేశం మంగళవారం మధ్యాహ్నం 2గంటలకు ఎంపిపి దివాకర రత్న ప్రసాద్ అధ్యక్షతన జరుగనున్నట్లు ఎంపిడిఒ షేక్ మహబూబ్ సుభాని తెలిపారు. ఎజెండాలోని అన్ని శాఖల పని తీరు, అభివృద్ధిపై సమీక్ష చేయనున్నట్లు తెలిపారు. ఆయా శాఖల అధికారులు పూర్తి సమాచారంతో, ఎంపిటిసిలు, సర్పంచులు, కార్యదర్శులు హాజరు కావాలని కోరారు.

ఉత్సాహంగా పొట్టేళ్ల పోటీలు

ప్రజాశక్తి-శింగరాయకొండ

శింగరాయకొండ మండలం పాత శింగరాయకొండ శ్రీవరాహ లక్ష్మీనరసింహ స్వామి బ్రహ్మోత్సవాల సందర్భంగా శ్రీకృష్ణ యాదవ్ యూత్ ఆధ్వర్యంలో రాష్ట్రస్థాయిలో పొట్టేళ్ల బల ప్రదర్శన సోమవారం నిర్వహించారు. ఈ పోటీలకు టిడిపి మండల అధ్యక్షుడు, వేల్పుల సింగయ్య, ఉప సర్పంచి నక్క బ్రహ్మేశ్వరరావు ప్రారంభించారు. ఈ పోటీలకు నెల్లూరు, ప్రకాశం, బాపట్ల జిల్లాల నుంచి 12 జతలు వచ్చాయి. మొదటి బహుమతిని సంతనూతలపాడు మండలం ఎనికపాడుకు చెందిన పొట్టేలు సాధించాయి. విజేతకు రూ.25 వేల నగదు, షీల్డ్ టిడిపి నాయకులు నర్రా రాంబాబు అందజేశారు. రెండో బహుమతిని బాపట్ల జిల్లా కొరిశపాడు మండలం మేదరమెట్ల గ్రామానికి చెందిన మేదరమెట్ల రవి పొట్టేలు కైవసం చేసుకుంది.విజేతకు పటాపంజాల కొండలు రూ.20 వేల నగదు అందజేశారు. తృతీయ బహుమతిని అద్దంకి మండలం పోటికల పూడికి చెందిన మారుబోయిన దుర్గాప్రసాద్ పొట్టేలు సాధించింది. విజేతలకు కొనికి అమర్నాథ్ రూ.15 వేల నగదు అందజేశారు. నాలుగో బహుమతిని బాపట్ల జిల్లా రేపణివరం గ్రామానికి చెందిన నేలపాటి గ్రామానికి చెందిన పొట్టేలు సాధించింది.. విజేతకు సోమరాజుపల్లికి చెందిన మసనం వెంకట్రావు బ్రదర్స్ ఆధ్వర్యంలో రూ.10 వేల నగదు అందజేశారు. పొట్టేళ్ల పోటీల సందర్భంగా ఎస్ఐ బి. మహేంద్ర ఆధ్వర్యంలో బందోబస్తు నిర్వహించారు.

పోటీలో తలపడుతున్న పొట్టేళ్లు

లక్ష్యానికి పట్టుదల తోడైతే విజయం సొంతం

కలెక్టర్ తమీమ్ అన్సారియా

ప్రజాశక్తి - ఒంగోలు సిటీ

విద్యార్థులు ఓ లక్ష్యాన్ని నిర్దేశించుకుని ఆ లక్ష్యానికి పట్టుదలను తోడు చేస్తే విజయం వారి సొంతమవుతుందని జిల్లా కలెక్టర్ తమీమ్ అన్సారియా తెలిపారు. ఒంగోలు నగర పరిధిలోని పెళ్లూరు సాయిబాబా సెంట్రల్ స్కూల్లో షైనింగ్ స్టార్స్ అవార్డ్స్ ప్రదానోత్సవం సోమవారం నిర్వహించారు. తొలుత కలెక్టర్ తమీమ్ అన్సారియా, ఒంగోలు, సంతనూతలపాడు ఎమ్మెల్యే దామచర్ల జనార్దనరావు, బిఎన్. విజయ కుమార్, నగర మేయర్ గంగాడ సుజాత, ఎపి లైవ్ స్టాక్ డెవలప్‌మెంట్ ఏజెన్సీ కార్పొరేషన్ చైర్మన్ షేక్ రియాజ్‌తో కలిసి జ్యోతి ప్రజ్వలన చేశారు. అనంతరం 10వ తరగతి, అత్యధిక మార్కులు 242 మంది. ఇంటర్లో అత్యధిక మార్కులు సాధించిన 36 మంది విద్యార్థులను సత్కరించి, సర్టిఫికెట్, మెడల్ మరియు రూ.20 వేల నగదు పురస్కారం అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ తల్లిదండ్రులు కూడా తమ పిల్లల సామర్థ్యాన్ని గుర్తించి అందుకు అనుగుణంగా ప్రోత్సహించాలన్నారు. ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్దనరావు మాట్లాడుతూ నేడు కార్పోరేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలను ఆధునీకరించి అవసరమైన మౌలిక సదుపాయాలతో నాణ్యమైన విద్యను అందించేలా రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తున్నదన్నారు. విద్యార్థులు ప్రభుత్వం అందిస్తున్న తోడ్పాటును అందిపుచ్చుకొని బాగా చదువుకుని జీవితంలో పైకి రావాలని సూచించారు. సంతనూత లపాడు ఎమ్మెల్యే బిఎన్.విజయకుమార్ మాట్లాడుతూ సామాజికంగా అభివృద్ధి సాధించాలంటే అది విద్య ద్వారానే సాధ్యమన్నారు. బడుగు, బలహీన వర్గాల ప్రజలు జీవితంలో పైకి రావాలంటే చదువు ఒక్కటే మార్గమన్నారు. నగర మేయర్ గంగాడ సుజాత మాట్లాడుతూ తలరాత మార్చేది చదువేనని తెలిపారు. ప్రతి ఒక్కరూ ఆసక్తితో చదువుకుని తమ భవిష్యత్తును తీర్చిదిద్దుకోవాలన్నారు. ఎపి లైవ్ స్టాక్ డెవలప్‌మెంట్ ఏజెన్సీ కార్పోరేషన్ చైర్మన్ షేక్ రియాజ్ మాట్లాడుతూ తల్లిదండ్రులు తమ పిల్లలకు ఆస్తులు ఇవ్వకపోయినా పర్వాలేదని, చదివించడం ఎంతో ముఖ్యమన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యా శాఖాధికారి ఎ. కిరణ్ కుమార్, ఆర్ఐఒ సైమన్ విక్టర్, విద్యాశాఖ అధికారులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

ప్రతిభా పురస్కారాలు అందజేస్తున్న కలెక్టర్, ఎమ్మెల్యేలు

వికసిత్ భారత్ లక్ష్యంతో

యోగాంధ్ర దిశగా అడుగులు

బాపట్ల జిల్లా కలెక్టర్ వెంకట మురళి

ప్రజాశక్తి - బాపట్ల జిల్లా

వికసిత్ భారత్ లక్ష్యంతో యోగాంధ్ర దిశగా ప్రభుత్వం అడుగులు వేస్తుందని కలెక్టర్ వెంకట మురళి తెలిపారు. 11వ అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని స్థానిక రథం బజారులో యోగాంధ్రపై సోమవారం శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. కల్చరల్ ఆర్టిస్ట్ యూత్ గ్రూప్ అంశంపై నిర్వహించిన కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ జె వెంకట మురళి, బాపట్ల ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ, జిల్లా అధికారులు పాల్గొని యోగాసానాలు వేశారు. కేర్ నాచురోపతి వైద్య కళాశాల విద్యార్థులు ప్రదర్శించిన విన్యాసాలు, యోగా విశేషంగా ఆకట్టుకున్నాయి. యోగాసానాలలో జాతీయ అవార్డు సాధించిన జె.పంగులూరు మండలం చందలూరు గ్రామం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థిని ఎన్.శశి నిర్వహించిన యోగాసానాల ప్రదర్శన అందరిని అబ్బురపరిచింది.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఆరోగ్యంగా ఉండాలంటే ప్రతి ఒక్కరూ యోగాను తమ జీవితంలో భాగం చేసుకోవాలన్నారు. దైనందిన జీవితంలో మానసిక ఒత్తిడి నుంచి ఉపశమనం పొందాలంటే యోగాతోనే సాధ్యమన్నారు. విశాఖపట్నంలో నిర్వహించే చారిత్రాత్మక కార్యక్రమంలో భాగంగానే ఈనెల 21న సూర్యలంక బీచ్ లో ఐదు వేల మందితో యోగా దినోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. బాపట్ల ఎమ్మెల్యే వేగేశన నరేంద్ర వర్మ మాట్లాడుతూ యోగా అంటే మన పూర్వీకులు కనిపెట్టిన ఒక గొప్ప ఆరోగ్య సూత్రమని తెలిపారు. ఇప్పుడు దేశ సరిహద్దులు దాటి ఇతర దేశాలలోనూ యోగాను పాటిస్తున్నట్లు తెలిపారు. ప్రతిరోజు గంట సేపు యోగా చేస్తే రక్త ప్రసరణ, గుండె, ఊపిరితిత్తుల పనితీరు, మరింత మెరుగుపడుతుందన్నారు. యోగా ఒక మతానికి చెందినది కాదని, పూర్వీకులు మనకు ఇచ్చిన ఆస్తి, సంపద అని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి జి.గంగాధర్ గౌడ్, ట్రైనర్ శైలజ, వివిధ శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

యోగాసానాలు వేస్తున్న కలెక్టర్

టంగుటూరు :యోగా చేయడం ద్వారా సంపూర్ణ ఆరోగ్యంగా జీవించవచ్చుని ఎంపిడిఒ ఆర్.దేవసేనకుమారి తెలిపారు. యోగా డే సందర్భంగా టంగుటూరు పంచాయతీ కార్యాలయం వద్ద నుంచి బస్టాండ్ సెంటర్ వరకూ ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఎంపిడిఒ మాట్లాడుతూ ఈనెల 21న విశాఖ పట్నంలో నిర్వహిస్తున్న యోగా డే గురించి అవగాహన కల్పించారు. యోగా చేయటం వల్ల ఆరోగ్య వంతమైన జీవితం పొందవచ్చునని తెలిపారు. ఈ కార్యక్రమంలో టంగుటూరు సర్పంచి మద్దిరాల మమత, మాజీ సర్పంచి బెల్లం జయంతిబాబు, మాజీ ఎంపిపి చదలవాడ చంద్రశేఖర్, రాష్ట్ర రైతు సంఘం ప్రధాన కార్యదర్శి బెజవాడ వెంకటేశ్వర్లు, ఎపిఎం సుబ్బారావు, ఉపాధి హామీ సిబ్బంది,

జరుగుమల్లి : యోగాపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఎంపిడిఒ కార్యాలయం వద్ద నుంచి పంచాయతీ కార్యాలయం, తహశీల్దారు కార్యాలయం మీదుగా ర్యాలీ నిర్వహించారు. తొలుత ఎంపిపి బెల్లం నిర్మల జెండా ఊపి ర్యాలీని ప్రారంభించారు. యోగాంధ్ర కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ భాగ స్వాములు కావాలని ఆమె పిలుపునిచ్చారు. యోగాతో మానసిక ఉల్లాసం కలుగు తుందన్నారు. ఎంపిడిఒ ఎంవి.రమణ మూర్తి మాట్లాడుతూ ఈనెల 21న విశాఖపట్టణంలో నిర్వహిస్తున్న యోగా డే పై అవగాహన కల్పించే విధంగా కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రంలో వివిధ శాఖల అధికారులు, సిబ్బంది, ఆరోగ్యకార్యకర్తలు పాల్గొన్నారు.

నాగులుప్పలపాడు: యోగాతో మానసిక ప్రశాంతత కలుగుతుందని ఇన్‌ఛార్జి ఎంపిడిఒ దక్షిణామూర్తి తెలిపారు. ఈనెల 21న అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా మండల పరిధిలోని సచివాలయాలు, పంచాయతీల్లో యోగాంధ్ర కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మండలకేంద్రమైన నాగులుప్పలపాడులో మాస్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపిడిఒ మాట్లాడుతూ యోగాసానాల ఆవశ్యకత, యోగా దినోత్సవం ప్రాముఖ్యతను గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో తహశీల్దారు ప్రవీణ్ కుమార్ , ఎంఇఒ రవి, ఎపిఒ రవిబాబు, ఎపిఎం నరేంద్రకుమార్ , పోలీస్ సిబ్బంది, కార్యదర్శులు పాల్గొన్నారు.

టంగుటూరులో ర్యాలీ నిర్వహిస్తున్న అధికారులు, నాయకులు

ప్రజల సమస్యలు పరిష్కరించాలి : డిఆర్ఒ

ప్రజాశక్తి - బాపట్ల జిల్లా

ప్రజల సమస్యల పరిష్కారానికి వెంటనే చర్యలు తీసుకోవాలని జిల్లా రెవెన్యూ అధికారి జి.గంగాధర్ గౌడ్ అధికారులకు సూచించారు. స్థానిక కలెక్టరేట్ లోని పిజిఆర్ఎస్ హాలులో జిల్లా రెవెన్యూ అధికారి అధ్యక్షతన ప్రజా సమస్యల పరిష్కార కార్యక్రమం నిర్వహించారు. జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ప్రజలు తమ సమస్యలపై అర్జీలు అందజేశారు. ఈ కార్యక్రమంలో 135 అర్జీలు నమోదయ్యాయి. పిజిఆర్ఎస్‌లో నమోదైన ప్రతి అర్జీని పరిష్కార దిశగా చర్యలు తీసుకోవాలని ఆర్‌డిఒ అధికారులకు సూచించారు. అనంతరం అధికారులతో వీక్షణ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్‌డిఒ మాట్లాడుతూ రెవెన్యూ శాఖలో పెండింగ్ ఉన్న కోర్టు కేసులకు వెంటనే కౌంటర్లు దాఖలు చేయాలని అధికారులకు, తహశీల్దార్లకు సూచించారు. కోర్టు తీర్పు వెలువడిన వెంటనే వాటిని అమలు చేయాలని ఆయన తెలిపారు. 2023–2024 సంవత్సరానికి సంబంధించిన కోర్టు కేసుల్లో కౌంటర్ వేయని వాటికి 3 నెలల్లోపు కౌంటర్ దాఖలు చేయాలన్నారు. కౌంటర్ విషయంలో శ్రద్ధ వహించాలన్నారు. కౌంటర్లు సకాలంలో వేయని వారిపై ఆలస్య రుసుం కోర్టులు వసూలు చేస్తాయని తెలిపారు. రెవెన్యూ శాఖలో 109, ల్యాండ్ ఎక్విజేషన్ కు సంబంధించి 8, సర్వేసులు సంబంధించిన 4 సివిల్‌సప్లయికి సంబంధించి 12 కేసులకు కౌంటర్లు దాఖలు చేయాల్సి ఉందన్నారు. జిల్లాలో వివిధ శాఖల పరిధిలో కంటెంట్ కేసులు 30 ఉంటే అందులో 21 కేసులకు కౌంటర్ దాఖలు చేశారని, మిగిలిన 9 కేసులకు వెంటనే కౌంటర్ దాఖలు చేయాలన్నారు. హైకోర్టు సెలవుల అనంతరం కోర్టు కేసులపై జిల్లా కలెక్టర్ సమీక్షిస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి జి.గంగాధర్ గౌడ్, జిల్లా పంచాయతీ అధికారి ప్రభాకర్, డిప్యూటీ కలెక్టర్ లవన్న, తదితరులు పాల్గొన్నారు.

తిరునాళ్ళ మహోత్సవ ఆహ్వానము
సంతరావూరు
శ్రీశ్రీశ్రీ కనక నాగవరపమ్మ అమ్మవారి దేవస్థానం
రావూరిపేట,వేటపాలెం మండలం,బాపట్ల జిల్లా.

బాపట్ల జిల్లా ,వేటపాలెం మండలం,
రావూరిపేట గ్రామంలో వేంచేసియున్న
సంతరావూరు
శ్రీశ్రీశ్రీ కనక నాగవరపమ్మ అమ్మవారి
తిరునాళ్ళ మహోత్సవం
తేది : 10-06-2025 మంగళవారం
నాడు అత్యంత వైభవంగా జరుగును.
కావున భక్తులెల్లరు అమ్మవారిని
దర్శించి,శిడిమాను ఉత్సవం
తిలకించి తీర్థ ప్రసాదములు
స్వీకరించి అమ్మవారి
కృపకు పాత్రులు
కావలసినదిగా ప్రార్థన.
ఇట్లు : సంతరావూరు,రావూరి పేట గ్రామాల ప్రజలు